

నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
1
శుక్రవారం 28 జులై 2023

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రియాంక



నవతెలంగాణ -సూర్యాపేటకలెక్టరేట్

సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా గురువారం సిహెచ్. ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి జగదీశ్ రెడ్డి ని జిల్లా కేంద్రం లోని మంత్రి క్యాంపు కార్యాలయం లో కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఉత్సాహంగా పనిచేయాలని, ఉద్యోగ విధుల నిర్వహణలో ప్రజల మెప్పు పొందాలని సూచించారు.

2వ వార్డులో మొక్కల పంపిణీ

నవతెలంగాణ-నకిరేకల్

మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాచకొండ సునీల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చోగోని శంకర్, రాచకొండ శ్రవణ్, రాచకొండ శ్రీధర్, పల్సా నరేష్, బండమీది శంకర్, వార్డు అధ్యక్షులు వంగాల కర్ణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు ఎండీ. అఖిల్, మెట్టు వినోద్, చెట్టిపాక లక్ష్మి, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

- ఆలేరు,భూదాన్‌పోచంపల్లి, తుంగతుర్తి, అర్వపల్లి,రాజాపేట మండలాల్లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- కూలిపోతున్న పాత ఇండ్లు
- వలిగొండ లోని మల్లెపల్లి చెరువుకు గండి
- కూలిపోయిన పాతగుట్ట కమాన్, వంగపల్లిలో నీటమునిగిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లు
- అడ్డగూడూరులో 10.86 సెం.మీ వర్షపాతం నమోదు


ఆలేరుటౌన్


ఆలేరురూరల్


తుంగతుర్తి

యాదాద్రిభువనగిరి జిల్లాలో వర్షపాతం వివరాలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో వర్షపాత నమోదు మిల్లీమీటర్ల ఇలా ఉన్నాయి. తుర్కపల్లి 98.2,రాజాపేట 85.4, ఆలేరు 95.2, మోట కొండూరు 64,యాదగిరిగుట్ట 99.6,భువనగిరి 74.2, బొమ్మలరామారం 63.2, బీబీనగర్ 43.8, పోచంపల్లి 74.4, చౌటుప్పల్ 28.4, సంస్థాన్ నారాయణపురం 36.8, రామన్నపేట్ 64.4, వలిగొండ 68.6, ఆత్మకూరు 78.4, మోత్కూర్ 97.6, అడ్డగూడూరు 108.6, గుండాల 108మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది.


భువనగిరి

నవతెలంగాణ - భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో చెరువులు వాగులు, కుంటలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అడ్డగూడూరు మండలంలో అత్యధికంగా 108.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని ఆలేరు, మూసి, (చిన్న ఏరు, పెద్ద ఏరు) బిక్కేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు వాగుల మీది నుండి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. స్థానిక సర్పంచులు పోలీస్ సహకారంతో రాకపోకలను నిలిపివేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, నీటిపారుదల శాఖలు, స్థానిక సంస్థల సహకారంతో ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు వాయిస్ రికార్డుతో ఫోన్ ద్వారా ప్రజా ప్రతినిధులను అప్రమత్తం చేశారు. జిల్లా కేంద్రంలోని హనుమానువాడ, బహర్ పేటలోని పాత ఇండ్ల గోడలు కూలిపోయాయి. భువనగిరి పెద్ద చెరువుకు షామీర్‌పేట వాగు నుండి పెద్ద ఎత్తున నీరు వస్తుండడంతో చెరువు నిండుకుండలా తయారైంది. యాదినేని చెరువు, తీనంచెరువు, అమ్మకుంట, బైరన్ కుంట, చెరువులు అలుగులు పోస్తున్నాయి. యాదగిరిగుట్ట నుండి పాత గుట్టకు వెళ్లే రహదారిలో ఉన్న పాత కమాను ఒక్కసారిగా నేలకొరిగింది. ప్లాస్టిక్, తాడిపత్రి కొనుగోలుకు ప్రజలు షాపుల వద్దకు వెళ్లుతున్నారు. తమ పాత ఇండ్లు కురవకుండా కప్పులు వేసుకునే పనిలో ఉన్నారు. వలిగొండ మండలం మల్లెపల్లి చెరువుకు గండి పడి నీరంతా దిగువ ప్రాంతానికి పోయి పంట పొలాలను మునిగిపోయాయి. చెరువులు, కుంటలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మత్స్య సంపద నీటిలో కొట్టుకుపోయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి :కలెక్టర్

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడే వరద పరిస్థితులపై జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం ఆమె రాజపేట మండలం రఘునాథపురం పొట్టిమర్రివాగు, చల్లూరు,


అర్వపల్లి

బేగంపేట రేణిగుంట వాగులను పరిశీలించారు. వాగుల వద్ద నిరంతర గస్తీ ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుండి బయటకి రాకుడదని, అత్యవసర సహాయం కోసం 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ నెంబర్ 08685 - 293312, వాట్సాప్ నెంబర్ 9121147135 వినియోగించుకోవాలని కోరారు.గ్రామాలలో టామ్ టామ్ ద్వారా పాతబడిన ఇళ్లలో, శిథిలావస్థకు చేరిన ఇళ్ళలో, నీటికి బాగా నానిన ఇండ్లల్లో ఎవరిని ఉండనీయకుండా దగ్గరలో ఉన్న కమ్యూనిటీ హాల్, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాలల్లో, సురక్షిత ప్రాంతాలలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, పోలీసు అధికారులు ఉన్నారు.

ఆలేరురూరల్ : నాలుగు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మంతపురి దగ్గర పేతురు వాగు కొలనుపాక దగ్గర ఉన్నటువంటి బిక్కేరు వాగు పితాంబరం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాకపోకలు బంద్ చేసి కంచె ఏర్పాటు చేశారు. అదేవిధంగా గొలకొండ గ్రామ సమీపంలో ఉన్నటువంటి పెద్దవాగు బ్రిడ్జి మీది నుండి 5 మీటర్ల ఎత్తులో నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో గమనించిన గ్రామ సర్పంచ్ బైరపాక లక్ష్మి స్థానిక ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్ రావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులను రాకుండా చూశారు. .చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేరే ప్రాంతానికి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి వచ్చింది .ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్ అనురాధ, ఎంపీ ఓ సలీం, పంచాయతీ కార్యదర్శులు సంపత్ రెడ్డి, రామకృష్ణ ,వీఆర్ఏలు మధు, పరశురాం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు జీడికల్లు రోడ్డు మధ్య రాకపోకలు బంద్

ఆలేరు నుండి మోత్కూర్ కు వెళ్లే రహదారి కి సమీపంలో మండలంలోని శారాజిపేట గ్రామ సమీపంలో ఉన్నటువంటి అడ్లూరి చెరువు ఉధృతంగా ప్రవహిస్తూ అలుగు పోస్తుండడంతో రోడ్డుమీదికి భారీగా నీరు రావడంతో గమనించిన స్థానిక సర్పంచ్ బండ పద్మ పర్వతాలు డీసీపీ రాజేష్ చంద్ర కు సమాచారం ఇచ్చారు. డీసీపీ వెంటనే స్పందించి గ్రామానికి వచ్చి రోడ్డుకు ఇరువైపులా భారీ క్రేడ్లను ఏర్పాటుచేసి అటువైపుగా వెళ్లే వాహనాలు దారి మళ్ళించి జనగాం నుండి వెళ్లేలా చేశారు . ఆయన వెంట ఏసీపీ సైదులు, ట్రాఫిక్ రూరల్ సిఐలు లింగయ్య, సురేందర్ రెడ్డి, ఆలేరు ఎస్సై వెంకట శీను ,ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ ,పంచాయతీ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.


యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్టరూరల్ : యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద వర్షానికి నీరు చేరి చెరువును, ఓ వైపు స్విమ్మింగ్ ఫుల్ ను తలపిస్తుందని ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణ, మండలంలో 19 చెరువులు - 2 చెక్ డ్యాంలు నిండి అలుగు పోస్తున్నాయి. చోల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో అధికారులు భారీ కేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలం

> ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. యాదాద్రిభువనగిరి జిల్లాలో అధికంగా వర్షం పడడంతో మూసీ, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆలేరులో పెద్దవాగు, భూదాన్‌పోచంపల్లిలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో పలు మండలాల్లో వర్షం పడడంతో చెరువులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

నిలిపి వేశారు. పలు చెరువులను ఇరిగేషన్ డీఈ బాలకృష్ణ పరిశీలించారు.

భూదాన్‌పోచంపల్లి : నాలుగైదు రోజుల నుండి ఎడతెరపు లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. హైదరాబాద్ భారీ వర్షాలు కురవడం మూసీ నది ప్రవహించడంతో పోచంపల్లి తహసీల్దార్ వీరా భాయ్ గురువారం మూసీని పరిశీలించారు. ప్రయాణికులను వెళ్లకుండా దారిని మూసివేశారు. జూలూరు రుద్రవెల్లి గ్రామాల మధ్య ఉన్న మూసీనదికి భారీగా వరద ప్రవాహం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్నచెరువులు నిండి అలుగులు పోస్తూ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. పురపాలక కేంద్రంలో రేవనపల్లిగ్రామానికి చెందిన మందుల రాములు ఇల్లు కూలిపోయింది. ప్రజలు బయటికి రావద్దని అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటికి రావాలని అధికారులుకోరారు .

భువనగిరి రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో భారీ వర్ష లాతు నిండిన కత్వ వడపర్తి గ్రామ సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తు ఈ కత్వ


మద్దిరాల

ద్వారా భువనగిరి , బీబీనగర్ చెరువు ల కు నీళ్లు వదలడం జరిగింది సందర్శించడానికి వచ్చిన యాత్రికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

జలమాయంగా ఆలేరు పట్టణం

ఆలేరుటౌన్ : ఆలేరు పట్టణ, బహదూర్‌పేట, సాయి గూడెం, సోమరాజు బావి, కమ్మగూడం, రెడ్డి గూడెం, రంగనాయకుల వీధి, పెద్దమ్మ వాడ, బీసీ కాలనీ, సిల్క్ నగర్, మార్కండేయ కాలనీ లలో 48 గంటల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఆలేరు పట్టణం పైన ఉన్న చెరువులు కుంటల నుండి వచ్చిన వరద నీరు తో కలిసి పట్టణం చుట్టూ జలమయంగా మారింది. పురపాలక సంఘం 12వ వార్డులో ప్రగతి విద్యాలయం దగ్గర ప్రవహిస్తున్న పెద్దమ్మ కాలువలో పశువుల దొడ్డి నీటిలో చిక్కుకుపోయింది. పశువుల దొడ్డి చుట్టూ వరద నీరు చేరడంతో బాధిత రైతు సహాయం కోసం 100 డయల్ కాల్ కు ఫోన్ చేస్తే స్పందించలేదని వాపోయాడు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బంది తలెత్తకుండా అన్ని పరిస్థితులు సమీక్షించి, సమస్యలు పరిష్కరించాలన్నారు. వరద నీరు చేరిన చోట పురపాలక సంఘం అధికారులు, రెవిన్యూ అధికారులు జేసీబీ ల సహాయంతో వరద నీరు వెళ్లిపోయేలా ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ శాఖల అధికారులు పట్టణమంతా కలియతిరిగారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం , ఎస్టీ హాస్టల్ ఐటిఐ కళాశాల పరిసర ప్రాంతాల్లో వర్షం నీరుతో జలమయం, మయమయ్యాయి. ఆలేరు పెద్దవాగు వద్ద వరద నీరు ఉధృతి పెరగడంతో దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు వచ్చి వీక్షిస్తున్నారు సెల్ఫీ ఫోటోలు దిగుతున్నారు. ఆలేరు, బచ్చన్నపేట, చేర్యాల, సిద్దిపేట జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. వీడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పీ రామకృష్ణ, పురపాలక కమిషనర్ చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతవరణ శాఖ నేటి నుండి 3 రోజుల వరకు భారీ నుండి అతి భారీవర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. పట్టణ ప్రజలందరు ఇళ్లలోనే ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రాకుడదని సూచించారు. సహాయం కోసం మున్సిపల్ అత్యవసర నెంబర్లు, 6300487155, 6281401 700, సంప్రదించాలని పేర్కొన్నారు.

అర్వపల్లి : మండలంలో కురిసిన వర్షం మూలంగా వర్షం సక్రమంగా బయటికి వెళ్లకపోవడంతో ఇళ్లలోకి ప్రవేశించి నిలవడానికి కూడా స్థలం లేకుండా పోయింది. మరోవైపు కేజీబీవీ పాఠశాలలోకి నీరు ప్రవేశించింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండల ప్రత్యేక అధికారి


భూదాన్‌పోచంపల్లి

రామారావు నాయక్ , తహసీల్దార్ యాదగిరి రెడ్డి పాఠశాలను పరిశీలించారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా కేజీబీవీ పాఠశాల విద్యార్థులను తల్లిదండ్రులకు సమాచారం చేరవేసి పిల్లలను వారింటికి పంపాలని ఆదేశించారు. మరోవైపు గ్రామంలో నీరు నిలిచి ఉన్న ప్రదేశాలను . ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సంవత్సర సమావేశం నిర్వహించారు. రోడ్డు వెడల్పులో భాగంగా సూర్యాపేట జనగాం రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కల్వర్టులు సక్రమంగా నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీరు బయటికి వెళ్లేదారి లేక నిలిచిపోయి ఇండల్లోకి చేరింది. సక్రమంగా నీరు వెళ్లకుండా నిర్మాణం చేపట్టిన కల్వర్టును ఇకనైనా అధికారులు తొలగించి తిరిగి పునర్నిర్ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుంగతుర్తి : గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల తుంగతుర్తి నియోజకవర్గం లోని పలు గ్రామాల చెరువులు కుంటలు నిండి అలుగులు పోస్తున్నాయి. మండల మండల పరిధిలోని అన్నారం సంగెం గ్రామాల మధ్య ఏరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. అదేవిధంగా వెలుగుపల్లి నుండి సూర్యాపేటకు వెళ్లే రోడ్డు పెద్ద చెరువులోకి ప్రవహిస్తున్న భారీ వరదనీటి కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది .మండల కేంద్రంలోని పూలగడ్డ ప్రాంతంలోని గాలివానకు పెద్ద వేప చెట్టు వేర్లతో సహా కూలి పక్కనే ఉన్న ఇంటి పై పడింది కానీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. రైతులు తమ పొలాలకు వెళ్లడానికి ఎటు చూసినా రోడ్లన్నీ వరద నీటితో కనిపిస్తుండడంతో పొలాల వద్దకు వెళ్లే పరిస్థితి లేదు. ఇటీవల చాలామంది రైతులు వరి నాట్లు వేశారు. అదేవిధంగా పత్తి మిర్చి వేసి వేల రూపాయలు ఖర్చు చేశారు. పంట పొలాలు తోటలన్నీ కూడా నీట మునగడం చేత రైతులు తీవ్ర విచారంలో ఉన్నారు. వర్షాల కారణంగా ఎవరు ప్రయాణాలు చేయవద్దని వరద ప్రవాహాలకు వెళ్ళవద్దని రెవెన్యూ శాఖ అధికారులు పోలీస్ శాఖ వారు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

మద్దిరాల : బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు చెరువులు,కుంటలు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నాయి. మద్దిరాల పెద్ద చెరువు ప్రమాద కరంగ అలుగు పోయడం తో గతంలో ఎన్నడూ లేనివిధంగా సూర్యాపేట - మద్దిరాల ప్రధాన రహదారి పైనుండి మోకాలు లోతు వరద రావడం తో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చెరువులు, కుంటలుపూర్తిగా నిండడంతో ఎప్పుడు ఏ చెరువు తెగుతుందోనని భయపడుతున్నారు. మండలంలో స్థానిక ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో లో స్థానిక పోలీసులు చెరువులు,కుంటలు


భువనగిరిరూరల్

దగ్గర గస్తీ నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్రం చేస్తున్నారు.

ఆస్పత్రులు, ల్యాబ్‌ల ఆకస్మిక తనిఖీ

- మూడు ఆస్పత్రులు సీజ్, మరో మూడు ఆస్పత్రులలో ల్యాబ్‌లు, ఐసీయూ సీజ్, షోకాస్ నోటీసులు
- డాక్టర్లు క్వాలిఫైడ్ వైద్య సిబ్బంది, రేట్లతో ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి
- ప్రయివేటు ఆస్పత్రులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

అక్రమార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా పుట్టగొడుగుల వెలిసిన ప్రయివేటు ఆసుపత్రులపై గురువారం నల్లగొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండల్‌రావు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల సేఫ్, కిన్నెర, అనిత ఆస్పత్రులను, మరో మూడు ల్యాబ్‌లను, సీజ్ చేశారు. ఇటీవల వైద్యం పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించకుండా అనుమతులు తీసుకోకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదులు అందడంతో గురువారం ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. కనీస వసతులు లేకుండా, కొన్నిచోట్ల, అసలు డాక్టర్లే లేరని, డాక్టర్ల పేర్లు లేకుండా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులంటూ బోర్డులను ఏర్పాటు చేసుకొని వైద్యం నిర్వహిస్తున్న తీరు తనిఖీలలో వెలుగు చూసింది. "మా" ఆస్పత్రులలో 24 గంటలు వైద్య సదుపాయాలు ఉంటాయని, పెద్ద అక్షరాలతో బోర్డులపై చూపిస్తూ నామమాత్రం వైద్యంతో వేలాది రూపాయలు దండుకుంటున్నారని పలువురు ఆస్పత్రుల వద్ద ఆరోపించారు. సౌకర్యాలు ఏమీ లేకున్నప్పటికీ ఆస్పత్రిలో ఏకంగా ఐసీయూ ఏర్పాటు చేయడం గమనార్హం. ఐసీయూ ఏర్పాటు చేయాలంటే 24 గంటలు పని చేసే ఒక సర్జన్, అనస్తీసియా డాక్టర్, ప్రత్యేకత కలిగిన మరో డాక్టరు, క్వాలిఫైడ్ వైద్య సిబ్బంది ఉంటేనే ఐసీయూ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, కనీసం డాక్టర్ లేకుండా ప్రభుత్వ వైద్యుడుచే నవీన ఆస్పత్రిలో ఏకంగా ఐసీయూ ఏర్పాటు చేయటం, ఇరుకు గదిలో ల్యాబ్ ఏర్పాటుపై డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండల్‌రావు తీవ్రంగా పరిగణించారు. వెంటనే ల్యాబ్, ఐసీయూ సీజ్ చేయించారు. రెండు వారాల వ్యవధిలో పూర్తి అనుమతులు, నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయకపోతే ఆస్పత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. నియమ నిబంధన విరుద్ధంగా నిర్వహిస్తున్న సాయి డయాగ్నొస్టిక్ సెంటర్‌కు షో కాజ్ నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు పొందిన తరువాత ప్రయివేట్ ఆస్పత్రులు నడపాలని, ప్రభుత్వ నియమ నిబంధనలను



ఆస్పత్రుల యజమాన్యం తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఆస్పత్రులలో విధిగా డాక్టర్లల, విద్యా అర్హతలు, అనుభవం, క్వాలిఫైడ్ వైద్య సిబ్బంది పేర్లు వివరాలు వైద్య పరీక్షల రేట్ల పట్టికతో కూడిన ప్లే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా రోగి ఆస్పత్రికి వచ్చిన సమయంలో వివిధ పరీక్షల రేట్లను పరిశీలించి.. తక్కువ రేట్లు ఉన్న ఆస్పత్రిలో తమ వైద్య సేవలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. షోకాజ్ నోటీసులు ఇచ్చిన ఆస్పత్రులలో 15 రోజులలో నియమ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవ అందించకుంటే ఆయా ఆసుపత్రులను సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు తాము విధులు నిర్వహించే "ఆస్పత్రి"లో సమయం కంటే ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రయివేట్ ఆస్పత్రులకు వచ్చి వైద్యం నిర్వహిస్తున్న తీరుపై డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కేసా రవి, డీఈఎంఓ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు

నవతెలంగాణ-చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చౌటుప్పల్ పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పట్టణకేంద్రంలో తిరుగుతూ వరద నీటిని పరిశీలించారు. ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాత పెంకుటిళ్ళు ,, రేకుల షెడ్డుల్లో నివాసముండే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. సాధ్యమైనంత వరకు వర్షాలు తగ్గే వరకు ప్రయాణాలు చేయవద్దని, ఇండ్ల నుండి బయటకు రావద్దని తెలిపారు. విద్యుత్తు స్థంభాల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. ఆయనవెంట మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, డీఈ విశ్వేశ్వర్‌రావు, హనుమాన్ ప్రసాద్, భరత్, నర్సింహా, సునీల్ ఉన్నారు.

50శాతం సబ్సిడీతో పశు బీమా

నవతెలంగాణ -ఆలేరుటౌన్

మదర్‌డెయిరీ ద్వారా 50 శాతం సబ్సిడీతో పశువులకు బీమా అవకాశాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్, దొంతిరి సోమిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా పాడి రైతులు జాగ్రత్తగా ఉండాలని, పాడి పశువులు ఎలాంటి ప్రమాదాలకు, విద్యుద్ఘాతాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్‌విన్‌ఓపెన్



నవతెలంగాణ -భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సందర్శనలో భాగంగా బ్రిటన్ డిపోయటీ హై కమిషనర్ గారెత్‌విన్‌ఓపెన్ కలిశారు. కలెక్టర్ మర్యాదపూర్వకంగా ఆయన శాలువా కప్పి మొక్క అందజేశారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లాలో అమలు జరుగుతున్న తీరును హైకమిషనర్ కు వివరించారు. అంతకుముందు ఉదయంన్ యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో పొలిటికల్ అడ్వైజర్ నళినీ రఘురామన్, ప్రొటోకాల్ ఆఫీసర్ ఖాజామైనుద్దీన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, యాదగిరిగుట్ట తహసీల్దార్, డీపీఎం పాల్గొన్నారు.

నవతెలంగాణ
నల్లగొండ
2
శుక్రవారం 28 జులై 2023




ఎల్‌ఓసీల పంపిణీ : ఎమ్మెల్యే

నవతెలంగాణ-నకిరేకల్



ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని నోముల గ్రామానికి చెందిన ఆలగడప అలివేలుకు రూ.2.50 లక్షలు, నకిరేకల్ పట్టణానికి చెందిన బెజవాడ నిహారికకు రూ.1.50 లక్షలు మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

'టీ 30 ను సద్వినియోగం చేసుకోవాలి'



నవతెలంగాణ-నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల ఖర్చును తగ్గించేందుకు నూతన పథకాలను అమలు చేస్తుందని, ఆర్టీసీలో టీ 30 బస్సు పాస్‌ని గ్రామీణ ప్రాంత ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి డిపో మేనేజర్ వెంకటమ్మ కోరారు. గురువారం మండల కేంద్రంలో పల్లె వెలుగు బస్సులో టీ30బస్ పాస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు 30 కిలోమీటర్లు ప్రయాణించే ప్రయాణికుల కోసం టీ 30 టికెట్ కొనుగోలు చేయడం ద్వారా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9:00 వరకు అప్ అండ్ డౌన్‌లో టికెట్ కొనుగోలు లో 10 నుంచి 30 రూపాయలు ఆదా అవుతాయని పేర్కొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తాం
- కలెక్టరేట్ ముట్టడిలో నేతల హెచ్చరిక



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఆలోపు పీఆర్సీ జీవో 60 ప్రకారం 19 వేల కనీస వేతనం అమలుకై సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, లేదంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జేఏసీ ఆధ్వర్యంలో గత 22 రోజులుగా జరుగుతున్న నిరవధిక సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ నల్లగొండ కలెక్టరేట్‌ను వేలాది మంది కార్మికులతో ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా పోటీ కార్మికులను పెట్టి నిర్బంధం ద్వారా సమ్మెను అనచాలని చూస్తే మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కేవీపీఎస్, ఐద్వా, వృత్తిదారుల సంఘాలు, పీవైఎల్, తెలంగాణ విద్యావంతుల వేదిక సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాలడుగు నాగర్జున, పాలడుగు ప్రభావతి, గంజి మురళీధర్, ఇందూరి సాగర్, పందుల సైదులు జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే కనీస వేతనం రూ.19 వేలు అమలు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రమాదకరమైన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లను



సహాయ కార్యదర్శిగా నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్, డీపీఓ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, సర్పంచులకు వినతి పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం స్పందించలేదని అందువల్లే సమ్మెలోకి వెళ్లామని తెలిపారు. కార్మిక సమస్యలు పరిష్కరించకుండా అధికారులు అదిరించి, బెదిరించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోటీ కార్మికులను పెడితే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి కార్మికుల మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న జేఏసీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జేఏసీ జిల్లా చైర్మెన్ చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 22 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం ఇదే ధోరణిని కొనసాగిస్తే అత్యవసర సేవలు, మంచినీళ్లు, వీధిలైట్లు, నిర్వహణను నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేవారు. జేఏసీ జిల్లా



ప్రధాన కార్యదర్శి పోతేపాక వినోద్ కుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు బీ.నరసింహ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు దండంపెల్లి సత్తయ్య, నారబోయిన శ్రీనివాస్, నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, కానుగు లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ, వరికుప్పల ముత్యాలు, జేఏసీ జిల్లా కో కన్వీనర్ పోలే సాంబయ్య, పొన్న అంజయ్యయస్ నరసింహ, పీ.సర్వయ్య, ఏర్పుల సైదులు, ఎండీ. జహీర్, ఎర్ర అరుణ, యాదమ్మ, కళావతి, రామలింగయ్య, ఎల్లేష్, కే.రాములు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

- రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా గత 22 రోజులుగా గ్రామపంచాయితీ కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వారి పట్ల సానుకూలంగా స్పందించాలని రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయితీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని స్థానిక నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ గత 22 రోజులుగా 12,700 మంది గ్రామపంచాయితీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నందున గ్రామాలలో అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి వారిని చర్చలకు పిలువాలన్నారు. గ్రామ స్వరాజ్యం వెల్లువిరవాలంటే గ్రామపంచాయతీ కార్మికులను హక్కున చేర్చుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వారిని పర్మినెంట్ చేసి బాధ్యతాయుతమైన ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ పంచాయితీ కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, వారి న్యాయమైన డిమాండ్లు



అన్నారు. జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిబ్బందిపై వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ కత్తుల శశాంక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.వెంకులు, కుర్షిద్ మియా, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఇందూరి సాగర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిక్షపతి, ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ఉమారాణి, భూతం అరుణ, మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అద్దంకి రవీందర్, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళి, ఐఎఫ్టీయు జిల్లా అధ్యక్షులు బొంగరాల నరసింహ, గాదె నరసింహ, కొండా వెంకన్న, పోలే సత్యనారాయణ, బొల్లు రవీందర్, ఒంటెపాక యాదగిరి, పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.



మూడవసారి బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నవతెలంగాణ-దేవరకొండ

అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతపల్లి మండలం పొల్లెపల్లిరాంనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి 80మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్‌రావు, ముద్దం జోగయ్యగౌడ్, ఉప సర్పంచ్ ఈరటి శంకర్, గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల రాములు, పిట్టల సాయిలు, ఈరటి చిన్న శేఖర్, కొప్పుల రాములుగౌడ్, నేనావత్ సుమన్, స్టాల్ రాములు, కొప్పుల యాదయ్య, ముత్యాలు, ముద్దం తిరపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల సమస్యల పరిష్కారించాలి

- జూలై 31న కలెక్టరేట్ ధర్నా
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్లను పర్మినెంట్ చేయాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 31న నలగొండ జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ జిల్లా పరిషత్ ముందు జరుగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరంలో కలెక్టరేట్ ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏ జీవోకు సంబంధం లేకుండా అతి తక్కువ 1,623 రూపాయలు, 4,000 రూపాయల వేతనం ఇస్తూ స్కూల్ స్వీపర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని



ఆరోపించారు. జూలై 31న జరుగుతున్న జిల్లా కలెక్టరేట్ ధర్నాకు స్కూల్ స్వీపర్లు, రిటైర్డ్ అయిన వారు, మరణించిన వారి కుటుంబ సభ్యులు అందరూ హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పనస నరసింహగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎండీ. హనీఫ్, మహిళా అధ్యక్షురాలు ఈ పూలమ్మ, మేడిగ నాగయ్య, కే.వెంకట్, నారాయణ, అండాలు, డీ.మల్లయ్య, సిహెచ్.నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వార్డు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ పట్టణంలో గత వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వార్డు అధికారులు స్థానికంగా ఉంటూనే అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి సూచించారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో వార్డు ఆధికారులు, మెప్మా ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది స్థానికంగా ఉంటూ వారి పరిధిలో వర్షాలు, వరదల వల్ల కలిగే ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు వచ్చిన శిథిలావస్థలో ఉన్న భవనాల వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారులకు సమాచారం అందించి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా



చూడాలని ఆదేశించారు. మరో రెండు రోజులపాటు కూడా వర్షాలు పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఏమైనా సమస్య వస్తే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పట్టణ మహిళలకు ప్రతి ఆదివారం 10గంటల 10 నిమిషాలకు అనే కార్యక్రమం పై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రతి మహిళను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎంసీ సయ్యద్ ముసబ్ అహ్మద్, టౌన్ ప్లానింగ్ అధికారి నాగిరెడ్డి, డిఈ వెంకన్న, ఏఈ రవీందర్, శానిటరి ఇన్స్‌పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు చేయాలి

- సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలపై పోరాడుదాం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

కేజీ టు పీజీ ఉచిత విద్యను అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న నకరేకల్లో ప్రారంభమైన సైకిల్ యాత్ర గురువారం నల్లగొండలో ముగిసింది. ఈ సందర్భంగా సైకిల్ యాత్రను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సైకిల్ యాత్రలో 652 కిలోమీటర్లు తిరిగి వివిధ మండలాలలో ఉన్న హాస్టల్లో, కస్తూరిబా పాఠశాలలోని సమస్యలను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీల పెంపు స్వాగతిస్తున్నామని, ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి ప్రయివేట్ కార్పొరేట్‌లకు రెడ్ కార్పెట్ వేసి వెల్ కమ్ చెప్తుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతున్నదని, కనీసం అకాడమీక్ ప్రారంభమై ఇన్ని రోజులు గడుస్తున్న విద్యారంగంలో ఎలాంటి సమస్యలు పరిష్కారం కాలేదని, విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వం సమీక్ష చేయకపోవడం వలన విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యల వలయంలో చదువుతున్న పరిస్థితి కనిపిస్తుందని చెప్పారు. ఎన్నికల పట్ల ఉన్న శ్రద్ధ కనీసం విద్యారంగం పైన లేకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి, గజ్వేల్ మోడల్ హబ్ వలె రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని, పేరుకుపోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం మేస్ ఛార్జీలు పెంచకపోవడం, పెంచినట్టు ప్రకటించిన మెను చార్జీలకు ఇప్పటివరకు కూడా జీవోను ప్రకటించకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.



గురుకులాలు, సంక్షేమ హాస్టల్లు అద్దె భవనంలో నడుస్తున్నాయని వాటికి సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి పెండింగ్లో ఉన్న మెస్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను, స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. రెండు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న 5,117 వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు, రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని, కార్పొరేట్ స్కూల్లో ఫీజులు నియంత్ర చట్టం అమలు చేయాలనిడిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్, లక్ష్మణ్, రేణుక, సైదా, వెంకటేష్, రమేష్, జగన్, వీరన్న, సంపత్, రవి, తరుణ్, సాయి, చందు, శ్రావణ్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల జీసీడీఓను సస్పెండ్ చేయాలి

తిప్పర్తి కస్తూర్బాకు ప్రహరీ గోడ నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల జిల్లా అధికారి జీసీడీఓను సస్పెండ్ చేయాలని, తిప్పర్తి కస్తూరిబాకు ప్రహరీ గోడ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర గురువారం తిప్పర్తి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాడుగులపల్లి మండలం, కేజీబీవీ పాఠశాలకు నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 70 శాతం నోటు పుస్తకాలు వచ్చిన స్వయంగా ఎంఈఓ చెప్పిన విద్యార్థులకు పంపిణీ చేయకుండా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్న ఎస్ఓలపై చర్యలు తీసుకోవాలన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చలర్లని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను కలెక్టర్ ప్రత్యేక కమిటీని నియమించి పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సంఘర్షణ సైకిల్ యాత్రకు తిప్పర్తి వచ్చిన సందర్భంగా ప్రజా సంఘాల బాధ్యులు, తిప్పర్తి మాజీ మండల అధ్యక్షులు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మన్నెం బిక్షం, ఎస్ఎఫ్ఐ మాజీ డివిజన్ అధ్యక్షులు, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేష్, మండల నాయకులు అకిటి లింగయ్య, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మైనం శివకుమార్, శరత్ కుమార్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్, లక్ష్మణ్, వెంకటేష్, జగన్‌నాయక్, సాయి, చందు, స్వామి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద తాకిడి

- 8 క్రస్టు గేట్లను ఎత్తి దిగువకు 25,489 క్యూసెక్కుల వరద నీరు విడుదల
- పరిస్థితిని సమీక్షించిన సీఈఈ, ఎస్ఈఈ, నల్లగొండ ఆర్డీవో బృందం

నవతెలంగాణ-కేతపల్లి



గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి భారీగా 25,489 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో మూసి ప్రాజెక్టు ఎనిమిది క్రస్ట్ గేట్లు సీ3, సీ4, సీ5, సీ6, సీ7, సీ8, సీ10, సీ12లను ఒక్కో గేటును ఐదు అడుగుల ఎత్తున ఎత్తి దిగివకు 25,489 క్యూసెక్కుల నీటిని బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓవీ. రమేష్ బాబు, ఇంజనీరింగ్ బృందం, నల్లగొండ ఆర్డీఓ ఎన్.రవి బృందం ప్రాజెక్టు పరిస్థితిని గురువారం సమీక్షించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 642.10 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.89 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు గేట్ల ద్వారా 25,207 క్యూసెక్కుల నీరును నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా 282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టును సమీక్షించిన వారిలో నీటిపారుదలశాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓవీ.రమేష్ బాబు, ఎస్ఈ శివధర్మ తేజ, ఈఈ బద్రు నాయక్, డీఈఈ చంద్రశేఖర్, ఏఈ ఉదయ్‌కుమార్, నల్లగొండ ఆర్డీవో ఎన్.రవి, కేతేపల్లి తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. మూసీ ప్రవాహం ఉధృతంగా ఉండటంతో పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మూసి ఎనిమిది గేట్లను ఒక్కసారి ఐదు అడుగుల ఎత్తు ఎత్తడంతో ఎగిసిపడుతున్న నీటి దృశ్యాలను చూసేందుకు పర్యాటకుల సందడి ఎక్కువ అయింది.

అనాథ విద్యార్థికి అత్యున్నత ర్యాంక్..

కంప్యూటర్ ఇంజనీరింగ్ సీట్ వచ్చిన జాయిన్ కాలేని స్థితి..

ఐఐటీ చదువుకు ఆర్థిక అడ్డంకి..

నవతెలంగాణ-మిర్యాలగూడ

పుట్టడం పేదరికం.. ఆపై చిన్నప్పుడే తల్లిదండ్రుల వివిధ వ్యాధులతో మృతి... ఐన విడవక విద్యను కొనసాగించాడు. పేదరికాన్ని జయించి ఇంటర్ వరకు పూర్తి చేశాడు. చదవంత ప్రభుత్వ బడులలోనే. పదవ తరగతి, ఇంటర్‌లో అతున్నత్త ర్యాంకులు సాధించడమే కాకుండా ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలోను ప్రతిభ కనబరిచాడు. దీంతో జోసా ర్యాంకుల ఆధారంగా సీట్ల కేటాయింపులో జమ్మూ రాష్ట్రంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజీరింగ్ (ఐఐటీ) కేటాయించింది. దీంతో ఆర్థిక ఇబ్బందులతో కోర్సులో అయ్యే విషయంలో సందిగ్ధంలో ఉన్నాడు ఆ విద్యార్థి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం బెట్టతండ గ్రామానికి చెందిన లావురి భద్రు-దస్లి దంపతుల కుమారుడు లావూరి బాలాజీ. 5వ తరగతి వరకు బెట్టతండ ప్రాథమిక పాఠశాలలో చదవగా, 6నుండి 8 వరకు దా మరచర్ల మండలంలోని బోత్తలపాలెంలో గల మోడల్ స్కూల్ చదివాడు. 8, 9 తరగతులు

దాతలు ఆదుకుంటే కోర్స్ పూర్తి : బాలాజీ

పేద, తల్లిదండ్రులు లేని తనకు దాతలు ఆదుకొని కోర్స్ పూర్తి చేసేందుకు ఆర్థిక సాయం చేస్తే ఐఐటీ పూర్తి చేసి పేదలకు సహాయం చేస్తానని ఐఐటీ ర్యాంకర్ బాలాజీ తెలిపాడు. కోర్స్ పూర్తి చేసేందుకు సహకరించే వారిని జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. సాయం చేయదలిచినవారు 84640 10402 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

దాతలు ముందుకు రావాలి : దశరథ్ నాయక్

పేద, ఆనాథ విద్యార్థి బాలాజీ చదువు పూర్తికీ దాతలు ముందుకు రావాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ దశరథ్ నాయక్ కోరారు. పేదల చదవుల పూర్తికి సంపన్నులు సహకరిస్తే ఋణపడి ఉంటారని ఆయన తెలిపారు.



మిర్యాలగూడ ప్రభుత్వ పాఠశాలలో చదవి 10/10 గ్రేడ్ సాధించాడు. ఇంటర్ ఎంపీసీ గ్రూప్ తీసుకొని బోత్తలపాలెం మోడల్ స్కూల్ చదవి ఎటువంటి ప్రత్యేక శిక్షణ లేకుండా 690 మార్కులు సాధించాడు. స్వయంకృషితో ఐఐటీకి ప్రిపేర్ అయి మెయిన్స్‌లో 75 పర్సంటైల్, అడ్వాన్స్‌లో ఎస్టీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 690 ర్యాంకు సాధించాడు. కష్టపడి ర్యాంకు సాధించి ఐఐటీకి ఎంపికైన జాయిన్ అయి కోర్స్ పూర్తి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులతో వెనుక ముందడుతున్నాడు. మొదట జాయినింగ్ సమయంలో కళాశాల, హాస్టల్ ఫీ పేరుతో 1.20 లక్షలు కట్టాల్సివుండడంతో ఏంచేయాలో అర్థంకాక అయోమయంలో ఉన్నాడు.

31న సాధారణ సమావేశం

నల్లగొండ కలెక్టరేట్ : ఈనెల 31న మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సాధరన సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

చిట్యాలటౌన్ :రానున్న రెండు, మూడు రోజులు పాటు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్ 9866755927 కు ఫోన్ గాని వాట్సాప్ ద్వారా గాని తెలిపాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామదుర్గారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించరాదని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణం కల్పించాలి



మిర్యాలగూడ : మణిపూర్ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కల్పించాలని లైట్ మోటార్ వెహికల్స్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ టాక్సీ స్టాండ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ కార్యదర్శి సయ్యద్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఇంకా హింసకాండ కొనసాగుతుందన్నారు. ఇండ్లు, దుకాణాలు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని వాపోయారు. హింసకాండ అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందయాన్ని ఆరోపించారు. ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని, దీనికి ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ పాల్గొన్నారు.

ఎంపీ స్వయం బాబురావు దిష్టి బొమ్మ దహనం



మిర్యాలగూడ : తెలంగాణను మరో మణిపూర్‌గా మార్చాలని బీజేపీ చూస్తున్నాదని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధనవత్ సిద్దు నాయక్ ఆరోపించారు. ఎంపీ స్వయం బాబురావు వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను స్థానిక రాగ్యానాయక్ విగ్రహం ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసి మెలిసి జీవిస్తున్న గిరిజన ప్రజల మధ్యలో చిచ్చుపెట్టి మరొకసారి రాజకీయంగా ప్రయోజనాలు పొందాలనీ చూస్తున్నారని విమర్శించారు. సోయం బాబురావు కేంద్రమంత్రికి బంజారా లంబాడి బిడ్డలను గిరిజనుల జాబితా నుండి తొలగించాలని లేఖ రాయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. బాబురావు లేకపై రాష్ట్ర అధ్యక్షుడు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ దనవత్ చందునాయక్, బాలునాయక్, సందీప్‌నాయక్, చంటినాయక్, నిలేష్ నాయక్, అవినాష్‌నాయక్, మల్సూర్‌నాయక్, పవన్‌నాయక్, సురేష్‌నాయక్, లిట్టునాయక్, రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ ఫామ్ తోటల సాగుపై అవగాహన

నవతెలంగాణ -తుంగతుర్తి

భారీ వర్షాల వల్ల ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యానవన శాఖ అధికారిని స్రవంతి అవగాహన కల్పించారు.గురువారం మండల పరిధిలోని ఆయిల్ ఫామ్ తోటలను పరిశీలించి మాట్లాడారు. ఈ మేరకు ఆయిల్ ఫామ్ తోటలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,చెట్ల పాదులలో, చెట్ల మొదలు చుట్టూ మొవ్వ మునిగిపోయేలా నీరు ఉన్నట్లయితే "మొవ్వకుళ్ళు" రోగం రావడానికి అవకాశం ఉంటుందని,చెట్ల పాదులలో నీరు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఆమె వెంట పతాంజలి ఆయిల్ ఫామ్ కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ రైతు నాగరాజు తదితరులు ఉన్నారు.

వేలవేల బోయిన మండల సర్వసభ్య సమావేశం

చిలుకూరు:ప్రజా ప్రతినిధులు అధికారులు రాకపోవడంతో గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వేలవేల పోయింది. లేటుగా ప్రారంభమైనప్పటికీ సకాలంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు హాజరు కాకపోవడం, గ్రామాలలో పలు సమస్యలపై సరిగా స్పందించకపోవడం, వ్యవసాయ పనులు ముమ్మారంగా సాగుతున్నందున అధిక వర్షాల వలన ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కాలేక పోయారు. దీంతో సర్వసభ్య సమావేశం సదాసీదాగా సాగింది. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బండ్ల ప్రశాంతి కోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, వైస్ ఎంపీపీ జనపనేని జానకి కృష్ణారావు, జిల్లా కోఆప్షన్ మెంబర్ ఎస్కే.మౌలానా మండల ఎంపీడీవో ఈదయ్య ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా పట్టణ సుందరీకరణ పనులు



- సద్దుల చెరువు చుట్టూత ఉట్టిపడుతున్న పచ్చదనం
- గ్రీనరీ తో ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్లు,
- పనులను పర్యవేక్షించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి
- గ్రీనరీ పనులను వేగవంతం చేయాలని ఆదేశం

నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సారథ్యం లో అందమైన పట్టణంగా రూపు దిద్దుకుంటున్న పట్టణంలో సుందరీ కరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు పట్టణంలో ని మెడికల్ కాలేజ్, సద్దుల చెరువు మినీ టాంక్ బండ్ వద్ద జరిగిన , జరుగాల్సిన పనులనుగురువారం మంత్రి జగదీశ్ రెడ్డి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఇప్పటికే గ్రీనరీ తో పూర్తైన ఐ లవ్ సూర్యాపేట, తెలంగాణా వంటి గ్రీనరీ బోర్డ్ లు సెల్ఫీ పాయింట్లు గా మారిపోయాయి. టాంక్ బండ్ నుండి హైవే వరకు చెరువు కట్ట పొడవునా దిగువన ఏర్పాటు చేసిన రక రకాల పూల మొక్కలు వాహనదారులను కనువిందు చేస్తున్నాయి. దాదాపు పట్టణంలో రెండు గంటల పాటు పర్యటించిన మంత్రి, ఎన్టీఆర్ చౌరస్తా, జనగాం క్రాస్ రోడ్స్ లో ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పచ్చదనం ఉట్టిపడేలా చౌరస్తాలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్వల్పంగా దెబ్బతిన్న ఎన్టీఆర్ పార్క్ వద్ద గల రహదారులను వెంటనే మరమ్మత్తు చేయాలని అధికారులు సూచించారు. మెడికల్ కాలేజీ హాస్టల్ విద్యార్థుల కోసం, వారికి ఇబ్బందులు తలెత్తకుండా మరో గేటును ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సాధ్యమైనంత తొందరగా నాణ్యతతో కూడిన గ్రీనరీ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. సూర్యాపేట ను దేశంలోనే నెంబర్ వన్ పట్టణంగా తీర్చిదిద్దడానికి జరుగుతున్న యజ్ఞంలో అధికారులకు తోడుగా ప్రజలు కూడా భాగస్వామి అందించాలని పిలుపునిచ్చారు.



మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం : మంత్రి జగదీశ్ రెడ్డి

భారత్‌లోని అత్యంత ప్రఖ్యాతిగాంచిన వారిలోఅబ్దుల్ కలాం ఒకరని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కొనియాడారు.గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన కలాం వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆయనను ఎంతోమంది ఆరాధించారని గుర్తుచేసుకుంటూ హృదయపూర్వకంగా నివాళులు అర్పించారు. దేశానికి మాజీ రాష్ట్రపతి కలాం చేసిన కృషి వెలకట్టలేనిదని, ఆయన సేవలు చిరస్మరణీయమని మంత్రి పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యస్. వెంకట్రావ్

నవతెలంగాణ -సూర్యాపేట కలెక్టరేట్



పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ వేగంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యస్. వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజక వర్గాల వారీగా వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పేర్ల మార్పు అలాగే పాత పోలింగ్ కేంద్రాల మార్పు ల పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏమైనా తమ అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలన్నారు. జిల్లాలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని , ఓటర్ సవరణ జాబితా పూర్తి స్థాయిలో ఉండేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ ఏ. వెంకట రెడ్డి, తహసీల్దార్ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నుండి చకిలం రాజేశ్వరరావు, సీపీఐ(ఎం)నుండి కోటా గోపి, బి.ఆర్.ఎస్ నుండి దేవర శెట్టి సత్యనారాయణ , బీఎస్పీ నుండి స్టాలిన్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన జీపీ కార్మికులు



- కలెక్టర్ కారు అడ్డగింత, సమస్యలు పరిష్కారం చేసేంత వరకు సమ్మె విరమించేది లేదు
- జేఏసీ జిల్లా కన్వీనర్ నెమ్మాధి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ -సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వందలాది మంది గ్రామపంచాయతీ కార్మికులతో దురాజ్‌పల్లి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో నిరసన తెలిపారు.గురువారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తీర్చాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి, జే ఏసీ కన్వీనర్ నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2020 నుండి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, వారాంతపు సెలవులు, ప్రమాద భీమా, చనిపోయిన కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా,కుటుంబానికి ఉద్యోగం, రిటైర్డ్ బెన్ఫిట్స్ 10 లక్షలు మంజూరు చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని నేరుగా వారి వ్యక్తి ఖాతాలో వేయాలని గత 22 రోజుల నుండి కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించక పోవడం అన్యాయన్నారు. సమ్మె విరమిస్తానే సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పడంనమ్మకం లేదన్నారు.సమస్యలు పరిష్కారం చేసేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం కొనసాగుతుందని చెప్పారు.ముట్టడి కార్యక్రమం దగ్గరకు అదనపు కలెక్టర్ వెంకట రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు మీ డిమాండ్స్ ను ప్రభుత్వం కలెక్టర్ ద్వారా నివేదించి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ తక్కువ వేతనం తో ఎక్కువ పని చేస్తున్న పేద వర్గాల కు చెందిన గ్రామ పంచాయితీ కార్మికుల ప్రభుత్వం ఉదాసీనంగా ఉండడం కరెక్ట్ కాదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయ మైన డిమాండ్స్ పరిష్కారం చేయాలన్నారు.గ్రామ పంచాచతీ జే ఏసీ నాయకులు రాధ కృష్ణ, లింగయ్య, సైదులు మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేసే కార్మికులకు, బిల్ కలెక్టర్, కారోబారులకు కేటగిరీ వైజుగా వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలోగ్రామ పంచాయతీ కార్మిక నాయకులు, ముత్తయ్య, చిమట నాగరాజు, సురేష్, రవి చంద్ర, సైదులు, రస్ మియా, నాగయ్య, శంభయ్య, అశోక, పీటర్, మర్రి బిక్షం, బిక్షం నాయక్, శ్రీనివాస్, రాంబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వట్టేపు సైదులు, శ్రీశైలం,సత్యనారాయణ, టి వెంకటేశ్వర్లు, హసన్, గోపిరెడ్డి, స్వరాజ్యం నాగమ్మ, వెంకటమ్మ దుర్గమ్మ , ఎల్లమ్మతదితరులు పాల్గొన్నారు.



మేళ్ళచెర్వు: గ్రామపంచాయతీ సిబ్బంది గత కొద్ది రోజుల నుండి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో గురువారం అన్ని జిల్లా కేంద్రాల లో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వటంతో మేళ్లచెర్వు, మల్లారెడ్డిగూడెం మండలాల నుండి సీఐటీయూ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సభ్యులు వట్టెపు సైదులు, మల్లికార్జున్, గ్రామపంచాయతీ సిబ్బంది వెంకట్, వెంకటేశ్వర్లు, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు



నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

మండలంలోని ఏపూరు వద్ద గల బిక్కేరు వాగు బ్రిడ్జిపై సుమారు 6 ఫీట్లకు పైగా నీటి ప్రవాహం ఉండడంతో సూర్యాపేట నుండి ముకుందాపురం వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ముక్కు దుదేవులపల్లి శివారు గుండ్ల సింగారం వద్ద బిక్కేరు బ్రిడ్జి పైనుండి నీటి ప్రవాహం ఉండడంతో సూర్యాపేట దంతాలపల్లి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మిద్దనపల్లి వద్ద పాలేరుకు వెళ్ళే బీక్కేరు వాగు పై నిర్మించిన బ్రిడ్జి కి తాకేలా భారీగా నీటి ప్రవాహం సాగింది. నసీంపేట వద్ద ఇటీవల మంజూరైన బ్రిడ్జి నిర్మాణానికి వేసిన అప్రోచ్ రోడ్డు వరద నీటికి తెగిపోయింది. దాంతో ఆత్మకూరు ఏపూర్ వైపు వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండల కేంద్రంలో బియ్యం కుంట అలుగుబోసి నీటి ప్రవాహం దుబ్బగూడెం దళిత కాలనీలో ఇళ్లలోకి చేరాయి. ఇటీవల సిసి రోడ్లు వేసిన కాంట్రాక్టర్లు కల్వర్టు లకు అవసరమైన మేర గూనలు వేయకపోవడంతో నీటి ప్రవాహం రోడ్డుపై నుండి ఇళ్ళలోకి చేరి జనజీవరానికి తీవ్ర ఇబ్బందులు కలిగించింది. పాతర్ల పాడు వద్ద అయ్యవారికుంట చెరువు నిండి శంభుని చెరువుకు వచ్చే వరద నీటి కాలువ తెగడంతో నీటి ప్రవాహం గ్రామంలోని వీధుల వెంట ప్రవహించింది. తర్లపాడు శంభుని చెరువు నిండి అలుగు పోయగ గ్రామస్తులు వరద ప్రవాణి లెక్కచేయకుండా చాపల షికారు జోరుగా చేశారు. నిమ్మి కళ్ళు దండు మైసమ్మ వద్ద రహదారిపై చౌటచెరువుఅలుగు పోయింది. మండల కేంద్రంలో కురుస్తున్న వర్షాలకు అబ్బగాని లింగయ్య ఇల్లుపూర్తిగా కూలింది.ఇప్పటికే సాగుచేసిన పత్తి ,వేరుశనగ, పెసర ,మినుము, కంది పంటలు నీట మునిగాయి. వరి సాగు కోసం వేసిన నారు మడులు నీటి పాలయ్యాయి.వరద ప్రవాహాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు తాసిల్దార్ పుష్ప ఎంపీడీవో మల్సూర్ నాయక్ , ఎస్ఐ వెంకటరెడ్డి, ఏఓ దివ్య వివిధ శాఖల అధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి తగిన ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించి వరద ప్రాంతాలను సందర్శించారు.

మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను పాతర్లపాడు వర్దకాలవ తెగిన ప్రాంతాలు సూర్యపేట ఇన్చార్జ్ ఆర్డీవో సూర్యనారాయణ సందర్శించి ఏర్పాట్లు చేయాలంటూ అధికారులకు ఆదేశించారు. ఆర్డిఓ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు రామారావు శ్రీకాంత్ లు తగిన వార్త కాలువను పూడ్చి వేసి పనులు ప్రారంబించారు.

నూతనకల్ : మండల పరిధిలో అన్ని గ్రామాలలో సుమారు మూడు రోజుల నుండి కురుస్తున్న ఎడతెర పని భారీ వర్షానికి గ్రా మాలల్లోని అన్ని చెరువుల కుంటలు నిండి అలుగులు వెళ్లి రవాణా దారులకు ఇబ్బందికరంగా మారాయి అన్ని గ్రామాలు జలదిగ్బంధమై రోడ్లపై నుండి నీళ్ళు వెళ్లడంతో రాక పోకలు నిలిచిపోయాయి సూర్యాపేట దంతాలపల్లి ప్రధాన రహదారి పై ఉన్న పాలేరు వాగు మీద నిర్మించిన బ్రిడ్జిపై సుమారు నాలుగు ఫీట్లఎతు లో నీళ్లు ఎల్లడంతో ప్రజా ప్రతినిధులు పోలీసు సిబ్బంది అప్రమత్తంతో ఎటువంటి ప్రమాదానికి గురికాకుండా చూసి రాకపోకలను నిలిపివేశారు ఈ సంఘటన స్థలాన్ని ఎం పి పి భూ రెడ్డి కళావతి సంజీవరెడ్డి స్థానిక సర్పంచ్ కరుణ శ్రీ గిరిధర్ రెడ్డి ఎంపీటీసీ పన్నాల రమ మల్లారెడ్డి పరిశీలించి తగు జాగ్రత్త చర్యలను చేపట్టారు



నేరేడుచర్ల : గత మూడు నాలుగు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నేరేడుచర్ల పట్టణంలోని శివాజీ నగర్ కాలనీకి చెందిన ఇంజమూరి వెంకటయ్య కు చెందిన ఇల్లు బుధవారం రాత్రి కూలిపోయింది. పేదరికంలో ఉన్న వెంకటయ్య కు ఇల్లు కూలిపోవడంతో కుటుంబం మొత్తం నిరాశ్రయులయ్యారు. స్థానిక తహసిల్దార్ వాసిమల్ల సరిత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు గురువారం కూలిన ఇంటిని పరిశీలించి బాధితుడితో మాట్లాడారు. అనంతరం తక్షణమే బాధిత కుటుంబానికి ఐదువేల రూపాయలను ఆర్థికంగా సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డు కౌన్సిలర్ రణపంగ నాగయ్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం:గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఉన్న ఎంపీపీ ఎస్ పాఠశాల ప్రహరీ గోడ భారీ ఈదురు గాలులకు చెట్టు విరిగి ప్రహరీ గోడ మీద పడడంతో ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలినట్టు గ్రామస్తుడు మల్లె పాక యాకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు సెలవులు కావడం వలన ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. మండల విద్యాధికారులు స్పందించి తక్షణమే పాఠశాలను సందర్శించి ప్రహరీ గోడకు కావలసిన సదుపాయాలను ఏర్పరచాలని కోరారు



ప్రమాదకరంగా పెద్ద చెరువు అలుగు...

- వరద తీవ్రతకు కోతకు గురవుతున్న రోడ్డు....
- వానొస్తే రాకపోకలు బంద్..
- రోడ్డుపైకే వరద నీటి ప్రవాహం...
- ధ్వంసం అవుతున్న రోడ్డు..
- పట్టించుకోని అధికారులు..
- కల్వర్టు నిర్మాణం జరపాలంటూ ప్రజల డిమాండ్



నవతెలంగాణ-కోదాడరూరల్

వరద తాకిడికి లక్షల రూపాయల పెట్టి పోసిన రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. సరైన కల్వర్టు నిర్మాణాలు లేకపోవడం వరద తీవ్రతను అంచనా లేకపోవడంతో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రోడ్లు వరద తాకిడికి కోతకు గురవుతున్నాయి. వివరాల్లోకెళితే అనంతగిరి మండల వ్యాప్తంగా ప్రజల ప్రయాణ సౌకర్యం అనంతగిరి మండల కేంద్రం నుండి కోదాడ పట్టణం వరకు రహదారిని ఏర్పాటు చేశారు. అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల ఈ రహదారి గుండా ఉండడంతో నిత్యం ఈ రహదారికి రాకపోకలు అధికంగా ఉంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారి వర్షాకాలం వస్తే మాత్రం వరద తీవ్రత అధికమైనప్పుడు రహదారి గుండా రాకపోకలు పూర్తిగా బంద్ అవుతాయి. కారణం ఏమిటంటే కోదాడ పెద్ద చెరువు ఈ రహదారి వెంటే అనుకోని ఉండడంతో చెరువుకు పైనుండి వస్తున్న నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని షణ్ముఖ ఐటిఐ కాలేజీ పరిసర ప్రాంతంలో అలుగు ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పుడు అలుగు వద్ద ఎటువంటి ఇబ్బంది ఉండదు కానీ వర్షాకాలంలో చెరువుకు పైనుండి వరద ఫ్లోటింగ్ ఎక్కువైనప్పుడు అలుగు వద్ద వరద రహదారిపై నుండి ప్రవహిస్తుంది. ఈ క్రమంలో పూర్తిగా రాకపోకలు బంద్ అవుతాయి. ప్రతి ఏడాది ఇదే తంతు కొనసాగుతున్న అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..

కల్వర్టు నిర్మాణం జరగకపోవడంతో అలుగు వద్ద వాహనాలు అదుపు తప్పితే మాత్రం తమ ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుంది. అలుగు కింది ప్రాంతంలో పెద్దపెద్ద బండరాల్లో ఉండడంతో ఈ ప్రాంతం వద్ద ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రయాణించాల్సి వస్తుంది. అనంతగిరి మండల వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలు, కళాశాల విద్యార్థులు ప్రయాణికులు ఈ రహదారి విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వరద తాకిడికి కోతకు గురైన రోడ్డు వద్ద మరమ్మతులు చేపట్టి, కల్వర్టు నిర్మాణం జరపాలని కోరుకుంటున్నారు. నిత్యం అధికారులు ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్నప్పటికీ, వారికి ప్రమాద తీవ్రత కనిపించడం లేదా అని ప్రయాణికుల ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు ధ్వంసం అవుతుంటే అధికారులు పట్టించుకోరా? గోపాలకృష్ణ (కోదాడ వాసి)



ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రోడ్లు వరద తాకిడికి పూర్తిగా ధ్వంసం అవుతున్న అధికారులు పట్టించు కోకపోవడం విడ్డూరం. అనంతగిరి నుండి కోదాడకు రహదారికి పలు గ్రామాల ప్రజలతోపాటు ఖమ్మం జిల్లా నుండి ప్రజలు కూడా ఈ రహదారి గుండా ప్రయాణిస్తారు. అధికారులు కల్వర్టు నిర్మాణం జరపాలి. కోతకు గురైన రోడ్డును మరమ్మతులు చేయించాలి.



విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

నవ తెలంగాణ- మోతే

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరారం మండలం సవుల గూడెం గ్రామానికి చెందిన అరికె వెంకటేష్ (32) తమ గ్రామంలో పనులు లభించక పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తు న్నాడు. తెల్లవారుజామున నివాసానికి సమీపంలోని బట్టి పెళ్లి ముత్తయ్య చేనులో మలవిసర్జన కి వెళ్లాడు. అతను గమనించక పక్కనే ఉన్న నిమ్మల ప్రభాకర్ రెడ్డి తోట చుట్టూ అల్లిన తీగలకు తగిలాడు. వర్షం కావడంతో విద్యుత్ సరఫరాయి అక్కడక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు, సంఘటన స్థలాన్ని తహసీల్దార్ యాదగిరి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు .మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు.భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నికోలస్ తెలిపారు.

కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం

- మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్



డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కలాం వర్ధంతి సందర్భంగా విజయీభవ ట్రస్ట్, స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప శాస్త్రజ్ఞుడని, రాష్ట్రపతిగా అన్ని వర్గాల ప్రజల మన్ననలను అందుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. నేటి యువత డాక్టర్ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు, విజయీభవ ట్రస్ట్ అధ్యక్షులు చారుగండ్ల రాజశేఖర్, స్వర్ణభారతి ట్రస్ట్ అధ్యక్షులు గాదంశెట్టి శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మెన్ షేక్ రహీం, బడుగుల సైదులు, పందిరి సత్యనారాయణ, పందిరి రఘు, గోపాల్, బొగ్గారపు రామ్మూర్తి, సాయి, పైడిమర్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ సెంటర్లో కుళ్లిపోయిన గుడ్లు

నేరేడుచర్ల :మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ అంగన్వాడీ 5వ సెంటర్ లో కుళ్లిపోయిన కోడిగుడ్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం బాలామృతం స్కీం ద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు రోజూ ఒక గుడ్డు చొప్పున నెలకు 30 గుడ్లను పంపిణీ చేస్తున్నారు. ఆఫీసర్ల పర్య వేక్షణ లోపంతో ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కుళ్లిన గుడ్లు సరఫరా చేసి పసి పిల్లల జీవితాలతో చెలగాటమాడుతున్నారని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫీసర్లు స్పందించి బాధితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై అంగన్ వాడీ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈ నెల 8న అంగన్ వాడీ సెంటర్ కు కోడిగుడ్లు వచ్చాయని, వచ్చిన వాటిలో ఒక ట్రె గుడ్లు కుళ్లిపోయాయని అన్నారు. పై అధికారులతో మాట్లాడి మళ్లీ ఇలాంటి సంఘటనలు భవిష్యత్ లో జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.

పారిశుధ్యంపై అవగాహన

నవతెలంగాణ -అరవపల్లి

మండలంలోని కుంచమర్తి గ్రామంలో గురువారం ప్రాథమిక వైద్యాధికారి హర్షద్ ఆధ్వర్యంలో ప్రజలకు పారిశుధ్యం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కురుస్తున్న వర్షాల మూలంగా ఇంటి చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండి వ్యాధుల బారిన పడే అవకాశముందని, ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు

రంగు మారిన నీటిని వాడుకోవచ్చు

●మిషన్ భగీరథ డీఈ లక్ష్మణ్

నవతెలంగాణ- భువనగిరిరూరల్

జిల్లాకు వచ్చే హైదరాబాద్ మెట్రో బోర్డు నీరు, ఎల్లంపల్లి జలాశయానికి భారీ వరద కారణంగా గోదావరి నీరు టర్బిడిటీ వల్ల నీటి సాంద్రత పెరిగి కొంచెం రంగు రావడం జరుగుతుందని,, మిషన్ భగీరథ నీటిని వాడుకోవచ్చని మిషన్ భగీరథ డీఈ లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నదిలో వరదలు తగ్గేవరకు ఈ పరిస్థితి ఇలానే ఉంటుందని, మిషన్ భగీరథ నీటిని నిరభ్యంతరంగా గృహ అవసరాలకి వాడుకోవచ్చని, వేడి చేసి చల్లార్చి వడబోసి మిషన్ భగీరథ నీరుతాగొచ్చని తెలిపారు.

మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ- ఆలేరురూరల్

మణిపూర్ రాష్ట్రంలో మహిళలను వివస్త్రలను చేసి, లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వ్యకాస మండల అధ్యక్షులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, బండ్రీను డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పటేల్ గూడెం గ్రామంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు తెగలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని లేనియెడల రాష్ట్రపతి పాలన పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో నాయకులు నరసయ్య ,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

దూసరి సత్తయ్య స్ఫూర్తితో భూ పోరాటాలు



●సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి ఎండి.జహంగీర్

నవతెలంగాణ- ఆలేరు రూరల్

దూసరి సత్తయ్య స్ఫూర్తితో భూ పోరాటాలు కొనసాగించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలో గుండ్ల గూడెం గ్రామంలో సీపీఐ(ఎం) నాయకులు దూసరిసత్తయ్య వర్ధంతి సభ ఆ పార్టీ మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ అధ్యక్షతన కేబీఆర్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మాట్లాడుతూ దూసరి సత్తయ్య తను బతికినంత కాలం ఈ ప్రాంతంలో ఎక్కడ భూ పోరాటం జరిగిన ముందుండేవారన్నారు. ఈ ప్రాంతంలో జరిగిన భూ పోరాటంలో వందలాది ఎకరాలను గిరిజనులకు పంచిన భూపోరాటం లో ఆయన అగ్ర భాగాన నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితో మళ్లీ భూ పోరాటాలు కొనసాగించాల్సిన అవసరముందన్నారు .దూసరి సత్తయ్య తన బాల్యం నుండి తెలంగాణ సాయుధ పోరాటంలో సాయుధ వీరులకు సహాయ సహకారాలు అందించే వారన్నారు. వారికి సెంట్రీగా ఉండి వీరులను కాపాడే ధీరత్వం కలిగిన వారన్నారు. నేటి భావితరానికి దూసరి సత్తయ్య జీవితం ఆదర్శంగా నిలుస్తుం దన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ఈ ప్రాంతంలో బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మంగ నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ.ఇక్బాల్ ,దూసరి సత్తయ్య సతీమణి మల్లమ్మ ,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జూకంటి పౌలు, కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి మిట్ట శంకరయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కేతావత్ రాములు నాయక్ ,పట్టణ కన్వీనర్ మొరిగాడి రమేష్ ,సింగిల్ విండో మాజీ చైర్మన్ మొరిగాడి చంద్రశేఖర్ ,మేకల బాలరాజు,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బొమ్మ కంటి లక్ష్మీనారాయణ, సీఐటీయూ నాయకులు వడ్డేమాన్ బాలరాజు గుండ్లగూడ మాజీ సర్పంచ్ దూసరి విజయ ఆంజనేయులు ,దూసరి మురళి వడ్డేమాన్ విప్లవ్ ,చిక్కిళ్ళ ఉపేంద్ర, బత్తిని రంజిత్, శ్రీరాములు ,మిట్ట బిక్షపతి,కిష్టయ్య చంద్రయ్య, గ్యార అండాలు ,మేకల జంగమ్మ, మిట్ట పార్వతమ్మ , తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం చల్లబడ్డది రాజకీయాలు వేడెక్కుతున్నాయి

నవతెలంగాణ - భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాతావరణం పూర్తిగా చల్లబడ్డది కానీ రాజకీయాల హడావుడితో నాయకుల కార్యకర్తల చర్చలు వేడెక్కుతున్నాయి. భువనగిరిలో ఏది జరిగినా రాష్ట్రస్థాయిలో సంచలనం సృష్టించే విధంగా రాజకీయాలు, సంఘటనలు ఉంటాయి. రాజకీయ సమీకరణలు రోజురోజుకు మరుతున్నాయి. బలమైన సామాజిక వర్గానికి చెందిన భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కాంగ్రెస్‌లోకి తీసుకురావడానికి రాష్ట్రస్థాయి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నుండి డీసీసీ అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కారు ఎక్కడతో ఖాళీ అయిన ఈ స్థానాన్ని భర్తీ చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా బీఆర్ఎస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీలో ఉండి అసమ్మతి రాగం ఎత్తిన నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరడానికి చర్చలు జరుపుతున్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై విమర్శన అస్త్రాలు సంధిస్తూ కుంభం పార్టీని వీడారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి జిల్లాలో తన పట్టు నిలబెట్టుకోవడం కోసం వెంకటరెడ్డి కృషి చేస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ సీటుతో పాటు నియోజకవర్గాల్లో తను సూచించిన వ్యక్తులు నిలబడే విధంగా ప్రయత్నాలు చేస్తూ ముందుకు పోతున్నారు. ఇప్పటికే బీబీనగర్ చెందిన రామాంజనేయులు గౌడ్‌ను నిలబెట్టాలని బీసీ రాగం ఎత్తుకున్నారు. జిట్ట బాలకృష్ణా రెడ్డి, చింతల వెంకటేశ్వర రెడ్డి పార్టీలో చేరితే ఎవరికి ఎమ్మెల్యే సీటు ఇవ్వాలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఇద్దరికీ మాస్ ఫాలోయింగ్ ఉంది. ఇద్దరిలో ఒకరికి ఎంపీ ఒకరికి ఎమ్మెల్యే స్థానం కేటాయిస్తే ఎలా ఉంటుందో అన్న విషయం చర్చలు కొనసాగుతున్నాయి. కొత్తవారికి అవకాశం ఇస్తే పార్టీని నమ్ముకొని ఉన్న మా పరిస్థితి ఏందని యువ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగలపల్లి రవి పేర్కొంటున్నారు.



ముహూర్తం ఎప్పుడు?

సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి ,జిట్టా బాలకృష్ణారెడ్డి బీజేపీ నుండి కాంగ్రెస్ కి ఎప్పుడు వస్తారు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇరువురికి సొంత క్యాడర్ ఉంది వారు కొందరు ఇతర పార్టీలలో ఉన్న వీరి వైపే మొగ్గు చూపుతారు. ఇద్దరు మధ్య సయోధ్య కుదరకపోతే తిరిగి కాంగ్రెస్‌కు తలనొప్పి గానే ఉంటుంది.ఇప్పటికే ఇద్దరు అనుచరులు ఎవరికి వారు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న ఫొటోలను వాట్సాప్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మొదటి నుండి ఇప్పటివరకు ఇద్దరు భువనగిరి నియోజకవర్గానికి చేసిన సేవలు తెలంగాణ ఉద్యమంలో మీరు పోషించిన భూమికలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. చింతల వెంకటేశ్వర్ రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్‌కు వస్తారని ఆశతో కొందరు కుంభం వైపు వెళ్లకుండా వేచి చూసే ధోరణితో ఉన్నారు. చింతల బీఆర్ఎస్ నుండి వలసలు తీసుకొచ్చే అవకాశం ఉంది. జిట్టా బాల కృష్ణారెడ్డి బీజేపీ నుండి ,బీఆర్ఎస్ నుండి వలసలు తీసుకొచ్చే అవకాశం కలిగి ఉన్నారు.

పైళ్లకు పొంచిఉన్న ప్రమాదం

ఒకవైపు కాంగ్రెస్ నుండి టీఆర్ఎస్ లో చేరి కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కి గతంలో బలమైన ప్రత్యర్థిగా ఉండేవారు. కుంభం కారు ఎక్కడంతో పీల్చుకున్న పైళ్ల శఖర్ రెడ్డి కి సొంత పార్టీలో ముఖ్యంగా జెడ్పీచైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి పక్కలో బల్లెంగా ఉన్నారు. జెడ్పీచైర్మెన్‌కు భువనగిరి నియోజకవర్గంలోని 4 మండలాలలో పట్టున్న నాయకులు ఉన్నారు. ఒక విధంగా చెప్పాలంటే బీబీనగర్ మండలంలో పైళ్ల శేఖర్ రెడ్డి కంటే జెడ్పీచైర్మెన్ సందీప్ రెడ్డికే పట్టు అధికంగా ఉంటుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి ఆలేరు రాజకీయాలు రాష్ట్రస్థాయిలోనే ఆకట్టుకునే విధంగా ఉంటాయి.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



●కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ -భువనగిరిరూరల్

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడే వరద పరిస్థితులపై జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. గురువారం కలెక్టర్ రాజపేట మండలం రఘునాథపురం పొట్టిమర్రివాగు, చల్లూరు, బేగంపేట రేణిగుంట వాగులను పరిశీలించారు. వాగుల వద్ద 24/7 నిరంతర గస్తీ ఉండాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తునందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుండి బయటకి రాకుడదని, అత్యవసర సహాయం కోసం 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ నెంబర్ 08685 - 293312, వాట్సాప్ నెంబర్ 9121147135 వినియోగించుకోవాలని కోరారు. గ్రామాలలో టామ్ టామ్ ద్వారా పాతబడిన ఇళ్లలో, శిథిలావస్థకు చేరిన ఇళ్ళలో, నీటికి బాగా నానిన ఇళ్ళల్లో ఎవరినీ ఉండనీయకుండా దగ్గరలో ఉన్న కమ్యూనిటీ హాల్, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాలల్లో, సురక్షిత ప్రాంతాలలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రవికుమార్, పోలీసు అధికారులు ఉన్నారు.

24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

●నిందితుని వద్ద రూ.14 లక్షలు, స్కూటీ స్వాధీనం

●వివరాలను వెల్లడించిన డీసీసీ రాజేష్ చంద్ర



నవతెలంగాణ -భువనగిరిరూరల్

నగదు అపహరణకు గురికాగా కేసును యాదాద్రి భువనగిరి రాచకొండ కమిషనరేట్ భువనగిరి పోలీసులు 24 గంటలలో ఛేదించారు. గురువారం ఆ వివరాలను డీసీపీ రాజేష్ చంద్ర విలేకరుల సమావేశ నిర్వహించి, వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం... బొమ్మలరామవరం మండలం మల్యాల గ్రామానికి చెందిన శంకర్ బొమ్మలారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రయివేటు కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. అతని వద్ద మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన తుడుం వెంకటేష్ పని చేస్తున్నాడు. వెంకటేష్ ప్రతిరోజు శ్రీకాంత్ ఇంటికి వెళ్లి భోజనం తీసుకురావడం చేస్తూ ఉండేవాడు. ఇటీవల శంకర్ తన భూమిని సిటీలో ఉండే శ్రీకాంత్ అమ్మాడు. శ్రీకాంత్ ఈ నెల 26న ఉదయం సమయంలో వచ్చి ఆ భూమికి అమ్మకానికి సంబంధించి రూ.14 లక్షలు శంకర్ కు ఇచ్చాడు. శంకర్ తన డబ్బులను కార్యాలయ ఆవరణలోని తన కారులో పెట్టి కారుకు తాళం వేశాడు. ఇదంతా గమనించిన వెంకటేష్ , శంకర్ వాళ్లఇంటికి వెళ్లి మధ్యాహ్న భోజనంతో పాటు ఆ కారుకు సంబంధించిన డూప్లికేట్ తాళాన్ని తీసుకొచ్చాడు. భోజనం ఇచ్చి అనంతరం కారును డూప్లికేట్ కీతో ఓపెన్ చేసి, అందులోని డబ్బులను తీసుకొని తన స్కూటీలో వేసుకొని వెళ్లిపోయాడు. తన నగదు అపహరణకు గురైన విషయం తెలుసుకున్న శంకర్ బొమ్మలరామారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ట్రైన్ ఐపీఎస్, బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ హెచ్ఎస్ఓ శివం ఉపాధ్యాయ ఆధ్వర్యంలో పోలీస్ టీమ్ విచారణ ప్రారంభించి నిందితుని, రంగాపురం క్రాస్ రోడ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.14 లక్షలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ శివం ఉపాధ్యాయ , రూరల్ సీఐ సత్యనారాయణ యాదవ్, ఎస్సై శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్ జనార్దన్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టణ పరిసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు పట్టణ, బహుదూర్‌పేట, సాయి గూడెం, సోమరాజు బావి, కమ్మగూడం, రెడ్డి గూడెం, రంగనాయకుల వీధి, పెద్దమ్మ వాడ, ప్రజలు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి



అన్నారు. మరో అదనపు కలెక్టర్ భాస్కర రావుతో కలిసి గురువారం ఆలేరు పట్టణంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. బహదురుపేట వద్ద ఈదుల వాగు, రత్నాల వాగు, రంగనాయక వీధి, పెద్దమ్మ వాడలలో ప్రాంతాలను వారు పరిశీలించారు. పురపాలక సంఘం పాత కార్యాలయం, కొలనుపాక రోడ్డు వద్ద నీటి ఉధృతిని పరిశీలించారు. ఆర్ పి ఆర్ పి రెసిడెన్షియల్ కళాశాల వద్ద, ఎస్సీ కాలనీ వద్ద వరద నీటిని సమీక్షించారు. వరద నీటి బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాలుగు గంటల పాటు రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ వారు, పూరపాలక సంఘ సిబ్బంది తో పరిస్థితిని సమీక్షిస్తామన్నారు. వాతవరణ శాఖ నేటి నుండి 3 రోజుల వరకు భారీ నుండి అతి భారీవర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. పట్టణ ప్రజలందరు ఇళ్లలోనే ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రాకుడదని సూచించారు. సహాయం కోసం మున్సిపల్ అత్యవసర నెంబర్లు, 6300487155, 6281401 700, సంప్రదించలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి రామకృష్ణ , పాలక కమిషనర్ చక్రపాణి, ఎస్ఐ వెంకట శ్రీనివాస్ వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



వలిగొండలో 61 రోజులకు గ్రామసభ

●తుంగలో తొక్కుతున్న ప్రభుత్వ నిబంధనలు

నవతెలంగాణ -వలిగొండ



మేజర్ గ్రామపంచాయతీ వలిగొండలో మొదటి నుండి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సర్పంచ్ బోళ్ల లలిత గ్రామపంచాయతీని తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు నెలవారి మామూళ్ల మత్తులో ఉండడంవల్ల పాలకవర్గం ఆడింది ఆట పాడింది పాటగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన గ్రామసభ గురువారం 61 రోజుకు నిర్వహించారు .సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు కూర శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు నిలదీయగా సర్పంచ్ ఆదేశాల మేరకే మల్లెపల్లి లో గ్రామసభ నిర్వహించినట్టు తెలిపారు. మే 27న వలిగొండలో జరిగిన గ్రామసభలో భవిష్యత్తులో చేయబోయే పనులు తీర్మానించినప్పటికీ ఒక్క పని కూడా అమలు చేయలేదు. రేణుక ఎల్లమ్మ కళ్యాణం ముందు గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. కానీ ఎల్ఇడి లైట్లు కొనుగోలు చేసి రూ ఏడు లక్షలు ఖర్చయినట్లు గురువారం జరిగిన గ్రామసభలో చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. మల్లెపల్లిలో వలిగొండలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ధ్వంసం అయినప్పటికీ వాటిని బాగు చేయలేదుజ జూన్ నెలలో ప్రభుత్వ వారోత్సవాల సందర్భంగా రూపాలు ఇష్టారీతిన ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక ఒక వెంచర్లు ఖాళీ స్థలం 1100 గజాల భూమిని అమ్ముకున్నప్పటికీ పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మార్చి నెలలో మడిగలు వేలం వేసినప్పటికీ వేలం దక్కించుకున్న వ్యక్తులకు మడిగెలు మూడు నెలలుగా నిర్లక్ష్యం వహిస్తూ రూ.40 లక్షలకు పైగా గ్రామపంచాయతీని నష్టపరిచినట్లు ప్రశ్నించారు. ఇంటి అనుమతుల్లో మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న అనుమతుల్లో ఎన్ని లక్షలు జీపీలో జమ అయ్యింది ఇప్పటివరకు స్పష్టంగా చెప్పకుండా అవినీతికి పడుతున్నారని నిలదీశారు. మడిగలలో డీడీలు చెల్లించకుండా అక్రమంగా ఉంటున్న వ్యక్తుల పట్ల చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో రూ లక్షల్లో గ్రామపంచాయతీ నష్టపోతున్న పంచాయతీ అధికారులు నెలనెల మామూళ్లకు అలవాటు పడి గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతిని బట్ట బయలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం సీపీఐ(ఎం)నాయకులు డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో వందమంది చేరిక

నవతెలంగాణ- యాదగిరిగుట్ట



తుర్కపల్లి మండలం ఇందిరా నగర్ గ్రామంకు చేందిన కాంగ్రెస్ పార్టీ 100 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు. పార్టీలో చేరిన వారికి డీసీసీబీచైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల్లో కొత్త పాత అని తారతమ్యాలు లేకుండా పార్టీ బలోపేతానికి పనిచేయాలని కోరారు. మూడోసారి కూడా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.కెసిఆర్ హైట్రిక్ సీఎం అవుతాడని తెలిపారు.ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మాజీ ఎంపీపీ గజం ఉప్పలయ్య , గందమల్ల సర్పంచ్ ఎస్ పరమేష్,ఎంపిటిసి నరసింహులు,గ్రామ శాఖ అధ్యక్షులు ప్రేమ్ సాగర్,ఉపసర్పంచ్ భాస్కర్ ,మాజీ సర్పంచ్ కె వెంకటరెడ్డి ,పాల సంఘం చైర్మెన్ నగేష్ ,గంధమల్ల గ్రామ శాఖ అధ్యక్షులు అశోక్ పాల్గొనగా పార్టీలో చేరిన వారిలో చీకోటి కిషన్ చింతకింది నరసింహులు శ్రీనివాస్ ,చెక్క నరసింహులు ,సడాల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఆకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలో షాది ఖానా, వైఎస్ఎన్ గార్డెన్‌లో నిర్వహించే సీత డ్రైవింగ్ లైసెన్స్ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆలేరు మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య తెలిపారు. పట్టణంలో గురువారం జిల్లా అర్టీఏ సభ్యులు పంతం కృష్ణ తో కలిసి ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీ , యువకులకు 2 , 4 వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ లను మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీత సొంత నిధులతోఅవకాశం కల్పించబడిందన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, టెన్త్ సర్టిఫికెట్ జిరాక్స్ లు, దరఖాస్తు పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ పొందాలనుకునే వారు తీసుకురావాలని చెప్పారు.

ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్ , జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ బాలస్వామి,మార్కెట్ డైరెక్టర్ పి. వెంకటేష్, పి. శ్రవణ్ జూకంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగి రాకపోతే అత్యవసర సేవలు నిలిపివేస్తాం



● కలెక్టరేట్ మహా ధర్నా లో జేఏసీ నాయకులు

నవతెలంగాణ- భువనగిరి రూరల్

ప్రభుత్వం దిగిరాకపోతే అత్యవసర సేవలు నిలిపివేస్తామని గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల చైర్మెన్ దాసరి పాండు, సలహాదారులు పైళ్ల గణపతి రెడ్డి. జిల్లా కన్వీనర్ వడ్డబోయిన వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్షం సైతం లెక్కచేయకుండా మహా ధర్నా నిర్వహించారు. జేసీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని సమ్మె చేయడం జరుగుతుందన్నారు. ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలైన ఈఎస్ఐ పీఎఫ్ బీమా సౌకర్యాలు కల్పించాలని, 60 జీవో ప్రకారంగా బేసిక్ గా 19,600 నిర్ణయించాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని,కరోబర్లకు-బిల్లు కలెక్టరులకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి నేరుగా వేతనాలు బ్యాంకు ద్వారా చెల్లించాలని కార్మిక చట్టాలు ఈ ఎస్ ఐ, పిఎఫ్ పి ఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామ పంచయతీ కార్మికులు గత 22 రోజులు నుండి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. సమస్యలను పరిష్కరించకపోవతే అతివసర సేవలు లైట్స్, వాటర్ నిలిపి వేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మహిళ రాష్ట్ర కన్వీనర్ పొట్ట యద్దమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేష్, జిల్లా కోశాధికారి దొనురి నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా 500 జనాభా కు ఒక్క వర్కర్ ఉండాలని కార్మికులను తొలగించడం జరుగుతున్నదన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక జేఏసీ జిల్లా కన్వీనర్లు గడ్డం ఈశ్వర్, బందెల భిక్షం, సిఐటియు జిల్ల కమిటి సభ్యులు కొల్లూరి ఆంజనేయులు, మంచాల మధు,గాడి శ్రీనివాస్. నాయకులు మాండ్ర శీను, పాపయ్య, పాశం, బాలయ్య, యాదగిరి, రమేష్, యాదయ్య, యాదగిరి, ఎల్లయ్య, వెంకటయ్య బాల మల్లయ్య సోములు, ఐలయ్య స్వామి, నాగరాజు, యాకయ్య, శేఖర్, రామనరసింహ, స్వామి,



కిష్టయ్య, మాహా లక్ష్మీ, ఎల్లమ్మ, అనిత, పుష్పా, లక్ష్మీ పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు జీపీకార్మికుల సమ్మె 22వ రోజుకు చేరుకుంది. గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గ్యాద పాక రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో ప్రవీణ్ ,యాదగిరి ,దేవయ్య ,సంపత్, కవిత, సుగుణ, యాదగిరి ,యాకూబ్, శ్రీను ,జాంగిర్, బాబు పాల్గొన్నారు.

మల్లేపల్లి చెరువుకు గండి

●లక్షల్లో చేపలు నష్టం, పంట పొలాలు నష్టం



వలిగొండ :ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు వలిగొండ గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన మల్లెపల్లి చెరువుకు గురువారం ఉదయం గండి పడింది. దీంతో మత్స్య కార్మికులు పెంచుకుంటున్న చేపలు లక్షల్లో నష్టపోయారు ఇటీవలనే సాగు చేసిన పంట పొలాలు నీట మునిగాయి. వలిగొండ- వెలువర్తి ,వలిగొండ ,మోత్కూర్ మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. కాకతీయ మిషన్ రెండవ విడతలో చెరువు అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పుడే ఆ చెరువుకు రివిట్మెంటు నిర్మించకుండా కేవలం చెరువుకట్టపై మట్టి పోసి అప్పటి నీటి పారుదల శాఖ అధికారులు కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం ప్రదర్శించినారు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల కలెక్టర్ ప్రభుత్వం నీటిపారుదల శాఖ అధికారులను అప్రమత్తంగా ఉండాలని సూచనలు ఇస్తున్నప్పటికీ స్థానిక నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారు మూడు రోజుల నుండి తుఫాను పడుతున్నప్పటికీ భీమ లింగం కత్వ వద్ద తలుపులు మూసి వేసి ఉండి ఉంటే చెరువు తెగే పరిస్థితి ఉండేది కాదన్నారు గత సంవత్సరం వలిగొండ పట్టణ కేంద్రంలో కూడా మూసి కాలువ తెగి పట్టణంలో 10 ఇండ్ల వరకు నీటిలో మునిగి ఉన్న సంగతి తెలిసిందే అయినప్పటికీ కాల్వ మరమ్మతులు లేక షట్టర్లు పనిచేయక పరిస్థితి ఉన్నదని ప్రజలు విమర్శిస్తున్నారు .

యాదద్రి పట్టణ అభివృద్ధి... దేవస్థానం అభివృద్ధిలో భాగం కాదా?

● కొన్నేండ్లుగా డ్రెయినేజీ, వరదనీటితో పంట నష్టం

● పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ- యాదగిరిగుట్ట రూరల్

యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధిలో భాగంగా యాదాద్రి కొండ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించి, దాని చుట్టూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించారు. దానిని గండి చెరువు, పుష్కరణలు, పార్కింగ్ స్థలం డ్రెయినేజీలతో అనుసంధానం చేశారు. దీనిలోనేడ్రెయినేజీ నీరు, వర్షపు నీరు పట్టణంలోని కొంతడ్రెయినేజీ నీరు యాదగిరిపల్లిలోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ పక్కన ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకుండా కొంత వరకు కాలువ తవ్వి ఖాళీ ప్లాట్లు, పంట పొలాల పైకి నీరు వదిలేశారు. కాస్త కురిసిన వర్షానికి ఇటీవల నాట్లు వేసిన పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కొన్నేండ్ల నుంచి డ్రెయినేజీ నీరు, వర్షపు నీటితో యాదగిరి పల్లి లోని ఎస్సీ కాలనీ సీసీ రోడ్ వెంబడి నిరంతరం ప్రవహిస్తోంది. వర్షపు నీరు అధికమవడం వల్లరోడ్డు కింద మట్టి కొట్టుకొని పోవడం వల్ల కొంతవరకు సీసీరోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీనిని గమనించిన అధికారులు భారీకేడ్లు ఏర్పాటు చేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నిరంతరం ప్రవహిస్తున్న డ్రెయినేజీ నీరు వల్ల ప్లాట్లు, సాగు చేయని పొలాల్లో తుంగ పెరిగి నివాస గృహాల పక్కన పెద్ద అడవిని తలపిస్తోంది. విష సర్పాలు, ముంగిసలకు ఆశ్రయంగా మారింది. రోడ్డు వెంట వెళ్లేవారు నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు.

డ్రెయినేజీ నీటితో పంటపొలాలు దెబ్బతింటున్నాయి

రైతు పసుల మల్లేష్



సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల కొన్నేండ్ల నుంచి డ్రెయినేజీ వాటర్, వర్షం నీరు పొలం పైనుంచి వెళ్తున్నాయి. వర్షాకాలంలో వరద వల్ల పంట వేసిన వెంటనే నీట మునిగిపోయి, ఎండాకాలంలో పంట చేతికి వచ్చే ముందు చిన్న వర్షాలకే వరద వల్ల పంట కొట్టుకపోయి చాలా నష్టం వాటిల్లుతుంది. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలి.

మూడు నెలల్లో అండర్‌గ్రౌండ్‌డ్రెయినేజీని పూర్తిచేస్తాం

ఏఈఈ కరుణాకర్

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు టెండర్ ప్రక్రియ 1000 మీటర్లకు పూర్తయింది. కేఎస్ఆర్ కు 320 మీటర్స్, ఎల్ ఎస్ అర్ కు 680 మీటర్స్ వర్క్ టెండర్లు దక్కించుకున్నారు. వెయ్యి మీటర్ల తర్వాత డ్రెయినేజీ వాటర్ నాచురల్ ఫ్లో ద్వారా వెళ్లి వంగపల్లి చెరువులో కలుస్తుంది. వెంటనే పనులు ప్రారంభించి మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన జీపీ కార్మికులు

నవతెలంగాణ-మర్రిగూడ



రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జీపీ కార్మికుల సమ్మె 22వ రోజుకు చేరిన సందర్భంగా న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం కలెక్టరేట్ ముట్టడికి కార్యక్రమానికి మండల నుండి జీపీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన వారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వట్టిపల్లి హనుమంతు, ఊరిపక్క లింగయ్య, పెరుమాండ్ల మంజుల, పోలేపల్లి రాములు, నక్క నరసింహ, ఒంపు ముత్తమ్మ, సునీత, అమృత, సుజాత, పద్మ, యాదమ్మ, దుర్గమ్మ, బిడి లక్ష్మీకాంత్, మైలారం, నరసింహ, రమణ, తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి మాల మహానాడు మండల అధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత నాగిళ్ల మారయ్య 5 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. తన తండ్రి నాగిళ్ల రోశయ్య జ్ఞాపకార్థం గుడి నిర్మాణానికి విరాళం అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లం సుందర్‌రావు, ఎంజాల యాదగిరి, చెల్లం శివ, సందీప్, హరీష్, జావిద్ పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణంలో మొహరం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్లతో పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరుగుతూ ప్రదర్శన చేశారు. పట్టణంలోని ప్రకాష్ నగర్ తొమ్మిదో వార్డులో కుల మతాలకతీతంగా పీర్ల పండుగ ఘనంగా నిర్వహించారు. పీర్ల ప్రదర్శనను మాజీ కౌన్సిలర్ భవాండ్ల పాండు ప్రారంభించారు. నేడు శుక్రవారం పెద్ద సర్గర్, 29న శనివారం పీర్లు భాయిలో వేస్తారని అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బల వెంకన్న, దేశి రామ్ నాయక్, తెలుకుంట్ల శేఖర్, సైదులు, ముత్యాలు, పెంటయ్య, ఎం.నిరంజన్, పీ.యాదగిరి, నాగభూషణం, మైబెల్లి, షాకిర్, ముజఫర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పోస్ట్ కార్డు ఉద్యమం

నవతెలంగాణ-దేవరకొండ

జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో దేవరకొండలో సీఎం కేసీఆర్‌కు పోస్ట్ కార్డు ఉద్యమం గురువారం జర్నలిస్టులో నిర్వహించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే దేవరకొండ డివిజన్ ఇంచార్జ్ గాదగిరిధర్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సాయి విశ్వనాథ్, శ్రీను, రమేష్, చారి, వినయ్, శీను, కంబాలపల్లి శీను, మనీ, వైయస్ కరుణాకర్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీహెచ్ఏ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి'

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

వైద్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎం పి హెచ్ ఎ నోటిఫికేషన్ రద్దు చేయాలని సెకండ్ ఏఎన్ఎంలు గురువారం నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గత పది పదిహేను సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్ఎంలుగా, ఈసీ ఏఎన్ఎంలుగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల పైచిలుకు మందిమి ఫిమేల్ విభాగంలో పనిచేస్తున్నామని తమని రెగ్యులరైజ్ చేయకుండా కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. నోటిఫికేషన్ రద్దుచేసి ప్రస్తుతం పని చేస్తున్న వారినే సీనియారిటీ ఆధారంగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ తో వయో భారం రీత్యా తమలో చాలామంది అనర్హులు అవుతారని, అదీగాక ఇప్పటికిప్పుడు ఆన్లైన్ లో పరీక్ష రాసే వెసులుబాటు లేదన్నారు. ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ ను ఉపసంహరించుకొని ఇప్పటికే పని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను, ఈసీ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. నిర్మల, జి. హైమావతి, ఎం. వసుమతి, జి. అరుణ, సిహెచ్. సరిత, గీతా రాణి, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ అతిక్రమించినందుకు జరిమానా

నవతెలంగాణ-మిర్యాలగూడ

దామరచర్ల మండలం దిలావర్పూర్ గ్రామానికి చెందిన బెజ్జం సాయి ఏ సైదులు అను అతడు సోషల్ మీడియా (సామాజిక మాధ్యమాలు) లో అనుచిత ఆరోపణలు చేస్తూ, వివిధ వ్యక్తుల మధ్య వర్గాల మధ్య, వివిధ రాజకీయ పార్టీల మధ్య గొడవలు సృష్టించే విధంగా తప్పుడు మాటలు మాట్లాడుతూ వాటిని ప్రచారం చేస్తున్నందుకు గాను సత్ప్రవర్తన గురించి గతంలో తాసీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేశారు. బైండోవర్ చేసినప్పటి నుండి 01 సంవత్సర కాలంలో మార్పు లేకుండా బైండోవర్ నిబంధన లను అతిక్రమిస్తే అందుకు గాను లక్ష రూపాయల జరిమానా విధించినట్లు వన్టౌన్ సిఐ రాఘవేందర్ తెలిపారు. జరిమానా కాపీని తాసిల్దార్ అనిల్ కుమార్ సమక్షంలో బెజ్జం సాయికు అందించారు.

పేద ఆడబిడ్డల పెండ్లిండ్లకు పెద్దన్న సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే భగత్‌కుమార్

నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్

సీఎం కేసీఆర్ పేద ఆడపిల్లల పెళ్లి భారం కావద్దని వారి కోసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలని ప్రవేశపెట్టి ఆర్థికంగా చేయూతనందిస్తూ పేదఆడ బిడ్డల పెళ్లిలకు పెద్దన్నగా మారాడని ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 92 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మెన్ జువ్వాజి వెంకటేశ్వర్లు, స్థానిక తహసీల్దార్ పాండు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు



పిడిగం నాగయ్య, పాక్స్ వైస్ చైర్మెన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి తిరుమల్, పిఎసిఎస్ డైరెక్టర్ ఆవుల నాసర్‌రెడ్డి, ఏబీఎస్ఎస్ నియోజకవర్గం అధ్యక్షులు కేతావత్ భిక్ష్యానాయక్, ఎంపీటీసీ సలహాదారుడు బాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జంగాల లక్ష్మమ్మ, మండల ఉపాధ్యక్షులు చవ్వ నాసర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు జాటావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలం కమ్మగూడ గ్రామంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్, సెయింట్ థెరీసా పాఠశాలలో ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సామూహిక ఇంకుడు గుంత పనులను గురువారం ఎంపీటీసీ సిలువేరు విష్ణు కమ్మగూడ సర్పంచ్ నిర్మలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామెర భీమనపల్లి, కమ్మగూడ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తను పనిచేస్తున్నానన్నారు. సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టడం వలన నీరు నిలవకుండా ఉంటుందని, తద్వారా దోమల బెడదను నివారించడంతోపాటు, భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చర్చ్ ఫాదర్ చిన్నయ్య, ఏపీవో వెంకటేశం, మరియానంద్, ఫీల్డ్ అసిస్టెంట్ జహంగీర్, పౌలు, విజయ్ చెందర్, స్టెఫన్, కవిత, శ్రీకాంత్, వినోద్, కిరిటయ్య తదితరులు పాల్గొన్నారు.

విరిగిన చెట్టును తొలగించిన సీపీఐ నాయకులు

నవతెలంగాణ-మర్రిగూడ

గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మర్రిగూడ మండలం ఖుదాభక్షపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగిపడి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం సిపిఐ నాయకులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ సహాయంతో విరిగిన చెట్టును తొలగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షాల కారణంగా ముందస్తు చర్యలు

మున్సిపల్ కమిషనర్ డాక్టర్ రమణాచారి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ పట్టణంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి తెలిపారు. గురువారం మూడవ వార్డు పరిధిలోని శేషమ్మ గూడెం పాత పల్లె మధ్యలో ఉన్న కాజువేను ఆయన సందర్శించారు. గతవారం రోజులుగా విపరీతంగా వర్షాలు కురుస్తుండడంతో కాజ్వేపై వరద ఉధృతిగా ప్రవహిస్తుందని తెలిపారు. దీంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా వరద సాఫీగా పోయేలా జేసీబీతో అడ్డంగా ఉన్న చెట్ల పొదలను తొలగించడంతోపాటు రెండు వైపులా బార్కెట్లను ఏర్పాటు చేసి పోలీసులకు సమాచారం అందించారు. రెండు గ్రామాల రహదారిని మూసి వేయడం జరిగిందని ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

అధికారులపై చర్య తీసుకోవాలి

గురుకులం ఎదుట గిరిజన సంఘం ధర్నా

నవతెలంగాణ-దామరచర్ల

పాఠశాలలో చదువుతున్న బాలికలకు రక్షణ కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో దామరచర్లలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో బాలికలకు రక్షణ కరువైందన్నారు. మంగళవారం రాత్రి ఒక అబ్బాయి గోడ దూకి గురుకుల పాఠశాలలో ప్రవేశించి బాలికలను ఇబ్బందులు పెట్టినట్లు ఆరోపించారు. అంతటితో ఆగకుండా సిబ్బంది పై కూడా దాడికి పాల్పడినట్లు, ఇంత జరిగినా అధికారులు ఏమాత్రం పట్టి పట్టనట్లు ఉండడం తగదని విమర్శించారు. ఈ సంఘటన జరిగి 3 రోజులు గడుస్తున్నా నల్లగొండ ఆర్సీవో కనీసం తనిఖీకి కూడా రాలేదని ఆరోపించారు. వారానికి 3 సార్లు తనిఖీ చేయవలసిన ఆర్సీవో ఒక్క సారి కూడా తనిఖీ చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే కలెక్టర్ విచారణ జరిపించి ఆర్సీఓతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరో రాష్ట్ర కమిటీ సభ్యులు నాగు నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనునాయక్, మిర్యాలగూడ గిరిజన సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్, రాజు, సైద, నవీన్, తరుణ్, సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో మణిపూర్ లాంటి కుట్రలకు తెరలేపిన బీజేపీ

-తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణలో లంబాడీలను గిరిజన జాబితా నుండి తొలగించాలని, మణిపూర్ మారణహోమం లాగానే ఆందోళన చేస్తామని బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావు ప్రకటించడాన్ని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రవినాయక్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేశారన్నారు. కేంద్రం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై గిరిజనులు పోరాడకుండా పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతోనే బిజెపి పార్టీ ఇటువంటి కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. సోయం బాబురావు వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సోయం బాబురావు వ్యాఖ్యలపై గిరిజన తెగల మధ్య ఘర్షణ జరుగుతే అందుకు బీజేపీనే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుసపవత్ పాపా నాయక్, బాబునాయక్, దేశీరం నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే : దైద రవీందర్

నవతెలంగాణ-నకిరేకల్

తెలంగాణ రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పర్యటించి అకాల వర్షాలతో దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతివార్డులో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. మట్టి ఇంటి గోడలు తడిసి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రమాదకరంగా మారిన ఇండ్లను గుర్తించి స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని వారు ఇల్లు కట్టుకునేందుకు మూడు లక్షలు ఇప్పించి ఆదుకోవాలని తెలిపారు. అకాల వర్షాలతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని, పూడిక తీయించి వరద నీరు సాఫీగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని వార్డుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ వేయించి స్వచ్ఛమైన మంచినీరు అందించాలన్నారు. మున్సిపల్ చైర్మెన్, కమిషనర్ సమన్వయంతో పనిచేసి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ దేవిక, ఎండీ.యూసుఫ్, చనగోని రాజశేఖర్‌గౌడ్, నర్సింగ్ మహేష్, జావాజి ప్రమోద్‌కుమార్, వంటెపాక సతీష్, వంటెపాక నక్షత్, వరికుప్పల ముత్తయ్య, దైద సురేష్, పట్టేటి వెంకటేష్, ప్రభు కుమార్, నల్లగొండ మహేష్, నల్లగొండ సాయి, పందిరి సతీష్, కృష్ణ, గోపగాని లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కేతేపల్లి :గత కొద్దీ రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేతేపల్లి ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని అలాంటి సమయంలో ఎవరూ కూడా దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. పాడుబడిన మిద్దెలు, పడిపోయే స్థితిలో ఉన్న ఇళ్లల్లో, చెట్ల కింద, వాగుల వద్ద ఉండవద్దని సూచించారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని

-డీసీపీ రాజేష్ చంద్ర

నవతెలంగాణ- భువనగిరిరూరల్

చెరువులు నిండు కుండలా మారాయనీ, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ప్రవాహం వేగంగా ఉన్నప్పుడు దానికి ఎట్టి పరిస్థితుల్లో దాటడానికి ప్రయత్నించవద్దనీ యాదాద్రి భువనగిరి రాచకొండ కమిషనరేట్ భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.హైదరాబాద్ పరిధిలో మూసీ నదికి రెండు గేట్లు కూడా ఓపెన్ చేయనున్నట్లు వెల్లడి. ఈ నేపథ్యంలో మూసికి వరద పోటెత్తే అవకాశం ఉందన్నారు. భువనగిరి జోన్ లో 42 ప్రదేశాల్లో వాటర్ ఫ్లో అవుతున్నాయి. ఆ ప్రదేశాల్లో వద్ద భారీకెడ్లులు ఏర్పాటు చేశామనారు.రెవిన్యూ అధికారులు, పోలీసులు విధుల్లో ఉన్నారు వారందరికీ ప్రజలు సహకరించాలనారు.చెరువుల్లో చేపలు పట్టడానికి, ఈత కొట్టడానికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్ళవద్దన్నారు. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు 100 కి కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.పాత ఇళ్లు వర్షాలకు కూలిపోయే అవకాశం ఉంది వారు మమ్మల్ని సంప్రదిస్తే శిబిరాల్లో వసతి కల్పిస్తామనారు. కరెంటు తీగలను పట్టుకోవడం పచ్చిగా ఉన్న చెట్లను ముట్టుకోవడం , చెట్ల కింద నిల్చోవడం లాంటివి చేయవద్దన్నారు.

బట్టల పంపిణీ

నవతెలంగాణ -భువనగిరిరూరల్

భువనగిరి పట్టణానికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు రాణి పద్మ తన మనవరాలి మొదటి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీ వద్ద ఉన్న గ్రేస్ హోం నందు ఉన్న అనాథ పిల్లలకు కొత్త బట్టలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పిల్లలతో కేక్ కట్ చేయించి ఫ్రూట్స్ పంచిపెట్టారు. సి డబ్ల్యూ సి చైర్మెన్‌జయశ్రీ , రాణి పద్మ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ కె అరుణ, సెక్రెటరీ డాక్టర్ చావా ఆశ్లేష, ట్రెజరర్ వెంకమ్మ, డిసిపిఓ సైదులు, మాజీ అధ్యక్షురాలు లావణ్య, హెూం నిర్వాహకులు జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

చేపల వేట...



నవతెలంగాణ -బొమ్మలరామరం

మూడు రోజుల నుండి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు బొమ్మలరామారం మండలంలోని మర్యాల గ్రామంలో పోచమ్మ కుంట చెక్ డ్యాం నిండి అలుగు పారుతోంది. అలుగు పారే చోట యువకులు, గ్రామస్తులు చేపలు పడుతున్నారు.చేపలు పడుతున్న దృశ్యాలు నవ తెలంగాణ కెమెరాకు చిక్కాయి.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ

నవతెలంగాణ- నేరేడుచర్ల

,రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుజూర్ నగర్ ఆర్డీఓ ఎన్. జగదీశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో భారీ వర్షాల పట్ల అత్యవసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మూసి పరివాహక ప్రాంత గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి శంకరయ్య, తహశీల్దార్ వి సరిత, వ్యవసాయాధికారి ప్రీతం కుమార్, ఎస్ ఐ పి పరమేష్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మఠంపల్లి : బారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నందున మండంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సాయాగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని యతవాకిల్లవేములూరు ప్రాజెక్టు, వేములూరు వాగు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట యాతవాకిళ్ళ గ్రామ సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహారాజు, ఎంపీడీవో జానకి రాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, కొత్తూరు వెంకన్న, మండల రైతు సమన్వయ సమితి డైరెక్టర్ కాటాల లింగరాజు, బీసీ సెల్ అధ్యక్షులు ఎల్లవుల నాగయాదవ్, షేక్ జానీ తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు, కాలువలు ఉధృతంగా ప్రహిస్తున్నాయి. అలాంటి సమయంలో ఎవరూ కూడా వాటిని దాటే ప్రయత్నాలు చేయరాదని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

తుంగతుర్తి : తుంగతుర్తి మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు.గురువారం మండల పరిధిలోని వెంపటి, గొట్టిపర్తి, రావులపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల వద్దకు వెళ్లి కట్టల నాణ్యత పరిస్థితిని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు పురాతన ఇళ్లలో ఉండొదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి,వెంపటి గ్రామ సర్పంచ్ అబ్బగాని పద్మ సత్యనారాయణ గౌడ్,ఉపసర్పంచ్ భాష బోయిన వెంకన్న, మాజీ సర్పంచ్ కొండగడుపుల నాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ఉత్తమ ప్రమాణాలతో విద్య

● నోడల్ ఆఫీసర్ వీణ రోటే

నవతెలంగాణ - భువనగిరి



దేశంలో కేంద్రీయ విద్యాలయాల్లో అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్, కేవీ బొల్లారం ప్రిన్సిపాల్ వీణ రోటే అన్నారు. జాతీయ విద్యా విధానం 2020 పురస్కరించుకొని మూడో వార్షికోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియా రాణి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన మెరుగైన విద్యను అందించడమే కేంద్రీయ విద్యాలయాల లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా 1250 కేంద్రీయ విద్యాలయాలు, ఇతర దేశాల్లో మూడు కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయని అన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రవేశ వయస్సు పునర్వ్యవస్థీకరణ నైపుణ్య విద్యా ప్రేరణ బాల వాటికలో ప్రవేశం విద్యాప్రవేశం జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్ వర్క్ నైపుణ్య విషయం తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయ నల్లగొండ ప్రిన్సిపాల్ నాగభూషణం, సెయింట్ ఎలిజబెత్ పాఠశాల ప్రిన్సిపల్ నన్ లాలి, న్యూ డైమెన్షన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్వేత రెడ్డి, పాఠశాల సిబ్బంది అరుణ్ కుమార్, శర్వాణి, ప్రశాంతి, రెహానా, శిరీష, మమత, సఫియా, రమేష్, ఆనంద్, రాజకుమారి, ఫయాజ్ పాల్గొన్నారు

మణిపూర్ నింధితులను వెంటనే కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

మణిపూర్ లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి ,గ్యాంగ్ రేప్ చేసిన సంఘటనపై తక్షణం విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ్ల శోభారాణి , ఆలేరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కుడుదుల నగేష్ డిమాండ్ చేశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ తో కలిసి గురువారం వారు మాట్లాడుతూ మణిపూర్ లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ చేసిన సంఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. ఈ సంఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్య తీసుకోవాలని పద్మ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బోరెడ్డి జ్యోతి, జి దీప , పాల్గొన్నారు.

తెలంగాణను మరో మణిపూర్‌గా మార్చేందుకు బీజేపీ కుట్ర

-ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నేనావత్ జలందర్

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం

బీజేపీ తెలంగాణను మరో మణిపూర్ గా మార్చాలని చూస్తుందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేనావత్ జలంధర్ నాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కలిసిమెలిసి జీవిస్తున్న గిరిజన ,ఆది వాసి ప్రజల మధ్యల చిచ్చుపెట్టి మరొకసారి రాజకీయంగా ప్రయోజనం పొందాలని కేంద్రమంత్రి సోయం బాపు రావు ప్రయత్నం చేస్తున్నారన్నారు.బంజారా లంబాడి బిడ్డలను గిరిజనుల జాబితా నుండి తొలగించాలని లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. సోయం బాపూరావు వెనుక ఉన్న బీజేపీ అంతు చూస్తామని బంజారా పవర్ ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులను గిరిజన తండాల్లోకి రాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీలో ఉన్న బంజారా (లంబాడి) నాయకుల్లారా రాజీనామా చేయండని కోరారు. బాబు రావు లేక పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు,కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలన్నారు. లేకుంటే లక్షలాది మందితో లంబాడి ప్రజలు బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.బాపు రావు ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కొలనుపాక వద్ద బ్రిడ్జి నిర్మించాలి

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఆలేరు మండలం కొలనుపాక నుండి ఆలేరుకు వెళ్లే బ్రిడ్జిపై వాగు ప్రవహించడం వల్ల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బ్రిడ్జి నిర్మించాలని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొలనుపాక వాగును ఆయన సందర్శించారు. వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చాడ రాజు మహేష్ ఇమ్రాన్ ఖాన్ కాటమరాజు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా నాయకులంతా కేసీఆర్‌కు అమ్ముడుపోయారు : బూర నర్సయ్యగౌడ్

నవతెలంగాణ - గరిడేపల్లి



ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులంతా కేసిఆర్ కు, బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయారని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. గురువారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకర్ల లో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల చేతకానితనం వల్లే 500 కోట్లతో, 4 లక్షల ఎకరాలకు నీరందించే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు కంప్లీట్ చేయలేకపోయారని, కాంగ్రెస్ నాయకులంతా కేసీఆర్ కి అమ్ముడుపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీ కోసం ఎంత కష్టపడ్డా అది బురదలో పోసిన పన్నీరే అవుతుందని, కష్టపడి ఒకరిద్దరిని గెలిపించుకున్నా కూడా నియోజకవర్గ అభివృద్ధి అనే డైలాగ్ కొట్టి మళ్లీ ఆ నాయకులు బీఆర్ఎస్ లోకి వెళ్తారన్నారు. అధిష్టానం ఎంపి గా, ఎంఎల్ఏ గా ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.అంతకుముందు 14వ విడత ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం నగదు బదిలీ కార్యక్రమంలో భాగంగా కెవికె లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి లైవ్ టెలికాస్ట్ ను వీక్షించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా బిజెపి అధ్యక్షులు బొబ్బ బాగ్య రెడ్డి,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదగాని హరిశంకర్ గౌడ్, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ లవకుమార్,ఎడిఎ సంధ్యరాణి, సూర్యాపేట జిల్లా ఓబిసి మెర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు బూర మల్సూర్, అంబాల నరేష్, బాలాజీ నాయక్, తదితరులుపాల్గొన్నారు.

గ్రామాల పరిశీలన

వలిగొండరూరల్ : మండల పరిధిలోని గోకారం, ప్రొద్దుటూరు గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్షన్ సెంట్రల్ టీం ఆధ్వర్యంలో గురువారంసర్వే నిర్వహించారు. పారిశుధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణము, ప్రభుత్వ సంస్థలలో టాయిలెట్ల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణాలనుపరిశీలించారు . ఈ కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ సభ్యులు, డిపిఓ సునంద, డిఆర్డిఏ ఏపీడి శ్యామల , ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీఓ అంజిరెడ్డి గ్రామాల సర్పంచులు తుర్కపల్లి మాధవి సురేందర్, గరిసే నరసమ్మ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమం

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమం చేకూరుతుందని మండలంలోని అనాజిపురం గ్రామసర్పంచ్ చెన్ను శ్రీనివాసరెడ్డి అన్నారు. వికలాంగులకు అందచేస్తున్న ఆసరా పెన్షన్ మూడు వేల నుండి నాలుగు వేలకు పెంచిన కారణంగా సీఎం కేసీఆర్, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు గ్రామంలోని 30 మంది వికలాంగులతో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట ఆయన పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడు నిర్మించాలి

నవతెలంగాణ- భువనగిరిరూరల్

భువనగిరి మండలంలోని హన్మపురం మదిరే కుర్మగుడేం గ్రామం నుండి మన్నేవారి పంపు పోయే రోడ్డును బీటీ రోడ్డుగా వేయాలని సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన స్థానికులతో కలిసి రోడ్డును పరిశీలించి మాట్లాడారు. 22ఏండ్ల క్రితం మెటల్ రోడ్డు వేశారని ,గుంతల మయంగా మారిందని బీటీరోడ్డు వేయాలని పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి మోటే ఎల్లయ్య, రైతులు గదిరెడ్డి గోపాలరెడ్డి, పన్నల రాజిరెడ్డి, లింగారెడ్డి, ప్రతాపరెడ్డి, తోటకురి చంద్రయ్య, వంగేటి పోచిరెడ్డి, తోటకురీ గణేష్, అశోక్, ముద్దం యాదయ్య, తుమ్మేటి కొండల్, జాన చంద్రయ్య, మోటి కృష్ణ, కుసుమ రాములు, బల్ద మల్లయ్య, మోటే బిక్షపతి, మహేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు

నవతెలంగాణ -బీబీనగర్



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు శుక్రవారం నాడు మండలంలోని రాముడి గుండ్ల తండా గ్రామ పరిధిలోని కోక్య తండ లో జరుపుల బీమా ఇల్లు కూలిపోయింది.ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కూలి పనులు చేసుకునే తమకు ఇల్లు కూలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ప్రభుత్వం తనను ఆదుకోవాలని దంపతులు వేడుకుంటున్నారు.

షాట్ సర్క్యూట్ తో డీసీఎం దగ్ధం

నవతెలంగాణ- భువనగిరిరూరల్



ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్తో డీసీఎం దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కడారి వెంకటేష్ యాదవ్ డీసీఎం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా డీసీఎంను జీవనోపాధి కోసం నడిపి రాత్రి 9 గంటల సమయంలో స్కూల్ ముందు ఆవరణలో పార్కు చేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో డీసీఎం నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి విషయాన్ని అతనికి చెప్పారు. వెంటనే వాటర్ పైపుతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే డీసీఎం ముందు భాగం క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో వెంకటేష్ కు సుమారు 8 లక్షల పైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ -భువనగిరిరూరల్

ఆకాశవాణి ప్రాంతీయ వార్త విభాగం హైదరాబాదులో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో పార్ట్ టైం కరెస్పాండెంట్లు పీటీసీల నియమాకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఖాళీల వివరాలు హైదరాబాద్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కొమరం భీమ్ అసిఫాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ , ములుగు , నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్ , పెద్దపల్లి, రంగారెడ్డి వికారాబాద్, వరంగల్ అర్బన్/హనుమకొండ, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. 24 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలను ఆకాశవాణి వెబ్‌సైట్ లోని వేకెన్సీ విభాగంలో పొందుపర్చాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తుకు స్వయం ధృవీకరణ సర్టిఫికెట్ కాపీలు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు జోడించి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఇ) ఆకాశవాణి సైఫాబాద్, హైదరాబాద్ -500004 చిరునామాకు పంపాలని. పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలు ఈ నెల 31వ తేదీలోగా పంపించాలని కోరారు.

బజారయ్య దశదిన కర్మలో మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండల పరిధిలోని దుపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దొంగరి (భిక్షమయ్య) బజారయ్యా ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ఆయన దశదిన కార్యక్రమానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర ఉన్నంత విద్యామండలి డైరెక్టర్ ఒంటెద్దు నరసింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, జిల్లా నాయకులు మామిడి అంజయ్య, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగంధర్, సర్పంచులు బిట్టు నాగేశ్వరరావు, చెన్ను శ్రీనివాసరెడ్డి, నాయకులు గుగ్గిళ్ళ సోమయ్య, తురక భద్రయ్య, రాంబాబు, పొదిల నాగార్జున, దంతాల వెంకన్న, జడ వీరయ్య, కత్తి ఉపేందర్, మాతంగి అరవిందు, గుగిల్ల హుస్సేన్, శ్రీనివాస్, బాలుమల్లు రవియాదవ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటల్లో మొక్కల సాళ్ల మధ్య నీరు నిలవకుండా జాగ్రత్త పడాలి

నవతెలంగాణ -సూర్యాపేట రూరల్

పత్తి పంటల్లో మొక్కల సాళ్ళ మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా కాలువలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ జానిమియా అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల గ్రామంలో పత్తి చేను లను పరిశీలించి మాట్లాడారు.ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకుపత్తి పంటల్లో మొక్కల సాళ్ల మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా కాలువలు తీసుకోవాలని పత్తి రైతులకు తెలిపారు. నీరు నిలిచిన చేన్లలో తేమ అధికంగా ఉండటంతో నేలల్లో ఉన్న పోషకాలను, కొన్నిరోజుల వరకు మొక్కలు గ్రహించలేవని, పంట త్వరగా కోలుకోవడానికి నీటిలో కరిగే ఎరువులు అయిన 10 గ్రాముల పొటాషియం నైట్రేటు (మల్టికె) లేదా 19-19-19 లీటర్ నీటిలో కలిపి మొక్క ఆకులపై వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పంటలపై పిచికారి చేయాలని తెలిపారు. అలాగే ఎండ కాసిన తర్వాత పై పాటుగా ఎకరానికి 25 కిలోల యూరియాను, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను కలిపి మొక్కలకు 10.సెం.మీ దూరంలో వేసి మట్టిని కప్పాలని అన్నారు. ఎరువు వేసే ముందు చేనులో కలుపును పూర్తిగా నివారించాలన్నారు.కలుపు మూడు, నాలుగు ఆకుల దశ లో ఉన్నట్లైతే ఎకరాకు 400 మి.లీ క్విజలోఫాప్ ఇథైల్, ఫైరిథియోబాక్ సోడియం కలిపి వరుసల మధ్య కలుపు మొక్కలపై మాత్రమే పడేలా పత్తి మొక్కలపై పడకుండా జాగ్రత్తగా నాజిల్‌పై డోమ్‌ను అమర్చి పిచికారి చేయాలని అన్నారు. అలగేట్ వరుసల్లో మొక్కల దగ్గర ఉన్న కలుపును తీయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయేషా, రైతులు జక్కుల యాదయ్య, కన్నెబోయిన సైదులు, బీరెల్లి సత్తిరెడ్డి, దేవలింగం మొదలగు వారు పాల్గొన్నారు.

అధికారులు, ఉద్యోగులు అలర్ట్‌గా ఉండాలి

ఆర్డీవో సూర్యనారాయణ


నవతెలంగాణ-కోదాడరూరల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సూర్యాపేట జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించారని, డివిజన్ అధికార యంత్రాంగం మొత్తం అలర్ట్‌గా ఉండాలని ఆర్డీవో సూర్యనారాయణ అధికారులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి దయానందరావు అధ్యక్షతన డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షం కారణంగా గ్రామాల్లో ప్రమాదాలు జరగకుండా ప్రజలకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా చెరువు కట్టల భద్రత వర్షం కారణంగా ముంపుకు గురి అయ్యే ప్రాంతాలు, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. 24 గంటలు అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస శర్మ, ఎంపీడీవో విజయ శ్రీ, ఎంఈఓ సలీం షరీఫ్, పలు మండలాల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం...

- దుర్గంధం వెదజల్లుతున్న మినీ గిరిజన గురుకులం
- అంటి ముట్టనట్లు వ్యవహరిస్తున్న సిబ్బంది
- పిల్లలు అనారోగ్యాల బారిన పడే అవకాశం..

నవతెలంగాణ -చివ్వేంల



మండల కేంద్రంలోని గిరిజన మిని గురుకులంలో చెత్త పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది పిల్లలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. గిరిజన మిని గురుకులం పరిసరాలు చెత్తతో నిండిపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో చెత్త పేరుకుపోవడం తో పాటు వర్షం నీళ్ళు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే అధికారులు హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

వివరాలు అడిగి తెలుసుకుంటాను... ఆర్‌సీఓ లక్ష్మయ్య

హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకుంటాను. చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాను.

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ పెద్దపీట

నవతెలంగాణ- తుంగతుర్తి

మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని బీఆర్ఎస్ మైనార్టీ విభాగం తుంగతుర్తి పట్టణ అధ్యక్షులు నజీర్ పేర్కొన్నారు.గురువారంఆయన విలేకరులతో మాట్లాడుతూ... మైనార్టీల స్వయం ఉపాధి కోసం లక్ష ఆర్థిక సాయం జీవో విడుదల చేయడంతో మైనార్టీ కుటుంబాల తరపున నజీర్ కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ఏటవేల కోట్ల బడ్జెట్ కేటాయించడంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనం కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన ఘనుడు కేసీఆర్ అని అన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలి

- మంత్రి జగదీశ్‌రెడ్డి
- భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



జిల్లా స్థాయి అధికారులతో సమావేశం...

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థలో ఉన్న భవనాలు నాని ఉంటాయని ఏమాత్రం పెద్ద వర్షం వచ్చినా కూలిపోయి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో అధికారులు వాటిని గుర్తించి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జూమ్ మీటింగ్ ద్వారా క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో గత పది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన అధికారులను కోరారు. వర్షాలు గంటల వ్యవధిలోనే చిన్నగా ప్రారంభమై ఎక్కువ సెంటీమీటర్లకు చేరుకొని అధిక వర్షపాతం నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నదని వివరించారు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థలో ఉన్న భవనాలు నాని ఉంటాయని ఏమాత్రం పెద్ద వర్షం వచ్చినా కూలిపోయి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో అధికారులు వాటిని గుర్తించి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు నిండి గండ్లు పడే అవకాశం ఉంటుందని ఆయా ప్రదేశాలలో చాపలు పట్టడం లేదా ఈతకు వెళ్లేవారు ఉంటారని అలాంటి వారిని అధికారులు నిరోధించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ మాట్లాడుతూ మండల స్థాయి అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అదేవిధంగా ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇరిగేషన్ శాఖకు సంబంధించిన చెరువులు, కుంటల వివరాలు ఉన్న స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. గండ్లు పడే అవకాశం ఉన్న చెరువులు, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీస్ శాఖ ద్వారా తగు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఆర్అండ్‌బి శాఖ అధికారులు కల్వర్టులు, రోడ్ల మరమ్మత్తులపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా గతంలో వరదలు వచ్చి దెబ్బతిన్న వాటిని గుర్తించి సమస్యాత్మకంగా భావించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రిసిటీ అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరి చేస్తూ, శిథిలావస్థలో ఉన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను అమర్చాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించాలన్నారు. పోలీస్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తగిన బందోబస్తు చర్యలు తీసుకొని ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్తా, జే.శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ ప్రసాదరావు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

నవతెలంగాణ-కోదాడరూరల్

వాతావరణంలో మార్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. గురువారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలోని పల్లె దవాఖానాను జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వాతావరణంలో మార్పుల వల్ల మానవుని శరీరంపై ప్రభావం చూపిస్తాయని, నీటి సంబంధిత, ఆహార సంబంధిత, కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సహాయానికి 040 24651119 నెంబర్‌కి లేదా 9908595187 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ధర్మ తేజ, గుడిబండ పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ సుష్మ సూపర్వైజర్ సిద్ధమ్మ , ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీ సుధా, చంద్రకళ , ఆశా కార్యకర్తలు కళావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాన్వాసింగ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని సొలార్జంగ్ పేటలో ది కోదాడ కాన్వాస్సింగ్ అసోసియేషన్ కార్యాలయంలో ఆ సంఘ నూతన కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అధికారులు గట్ల కోటేశ్వరరావు, వెంపట మధుసూదన్, కుక్కడపు బాబు, పర్వతాలు ఆధ్వర్యంలో బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన వారిలో అధ్యక్షులుగా పిన్నపురెడ్డి వీరారెడ్డి, ఉపాధ్యక్షులుగా అగిరు మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శిగా కొత్త రాజారావు, సహాయ కార్యదర్శిగా తెల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా అప్పన్న సతీష్ ఎన్నికయ్యారు. అనంతరం గుమస్తాల సంఘం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా పాండురంగారావు, ఉపాధ్యక్షులుగా యర్రా వెంకట సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈదా నాగిరెడ్డి, సురేష్, కందిబండ వీరయ్య, కాన్వాసింగ్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో హామీలే తప్ప అభివృద్ధి లేదు

బీఎస్పీ జిల్లా నాయకులు దాసరి శ్రీను

నవతెలంగాణ- తుంగతుర్తి

బీఆర్ఎస్ పాలనలో హామీలే తప్ప అభివృద్ధి లేదని బీఎస్పీ జిల్లా నాయకులు దాసరి శీను అన్నారు. గురువారం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మండల మొత్తాన్ని తిరిగి వరద ఉధృతికి జరిగిన నష్టాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ మేరకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టకపోవడం చేత రాకపోకలకు అంతరాయం కలుగుతుందని గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే తుంగతుర్తి గడ్డపై నీలి జెండా ఎగరవేయాలని దాని కోసం ప్రజలు నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు శోభ, మహిళా కన్వీనర్ మరికంటి మనీషా, నాగారం మండల అధ్యక్షులు యాదగిరి, చెరుకుపల్లి లక్ష్మణ్, దయాకర్ ,మల్లెపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-పెన్‌పహాడ్

గత కొద్దీ రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకన్నగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని అలాంటి సమయంలో ఎవరూ కూడా దాటే ప్రయత్నం చేయకూడదని ప్రజలకు సూచించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు పొలాల్లోకి వెళ్లి వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ మోటార్లు వద్దకు వెళ్లి స్విచ్ ఆన్ చేయవద్దని, రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రోడ్ల పక్కన వున్న విద్యుత్ స్తంభాలు పట్టుకుంటే విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, ఇతరతర జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.


వర్షాలపై అత్యవసర సమావేశం

నవతెలంగాణ-నాగారం

గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ జీ.హరిచంద్ర ప్రసాద్ అధ్యక్షతన గురువారం అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు భద్రత ఏర్పాటులకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. అనంతరం తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరు కూడా బయటకు రావద్దని విద్యుత్ మోటార్ల దగ్గరికి వెళ్లకూడదని ఆదేశించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బంది కలిగితే 100 నెంబర్ కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జీ.శోభారాణి, ఎస్సై ముత్తయ్య, ఏవో గణేష్, ఎంపీఓ దారా శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవ తెలంగాణ -నూతనకల్



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెద నేమిల గ్రామ శివారులో 365 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెడనేమిల గ్రామానికి చెందిన రాచకొండ విప్లవ్ (35) మరిపెడ బంగ్లా నుండి తన ద్విచక్ర వాహనం పై స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుండి డీకొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రహదారి పై వెళ్తున్న స్థానికులు 100కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య జ్యోతి పిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం సూర్యాపేట కు తరలించినట్లు ఎస్ ఐ సలిగంటి నరేష్ తెలిపారు.

బిజినెస్

ఎల్ఐసీ నుంచి కొత్త జీవన్ కిరణ్ ప్లాన్

కనీసం రూ.15 లక్షల బీమా హామీ
ప్రీమియం సొమ్ము మొత్తం వాపస్
సింగిల్ ప్రీమియంను ఎంచుకోవచ్చు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) కొత్తగా జీవన్ కిరణ్ పేరుతో టర్మ్ పాలసీని ఆవిష్కరించింది. ఇది నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ వ్యక్తిగత పొదుపు, జీవిత బీమా పాలసీ అని ఆ సంస్థ వెల్లడించింది. మెచ్యూరిటీ కాలం పూర్తయిన తర్వాత మొత్తం ప్రీమియం వెనక్కు ఇవ్వనున్నట్టు తెలిపింది. జీవన్ కిరణ్ (ప్లాన్ 870) ఇతర వివరాలు.. 18-65 ఏండ్ల లోపు వారు ఈ ప్లాన్ తీసుకోవడానికి అర్హులు. పాలసీ కాలంలో ఏం జరిగిన పాలసీదారు కుటుంబసభ్యులకు బీమా మొత్తాన్ని చెల్లిస్తుంది. సాధారణ టర్మ్ పాలసీల్లో ప్రీమియం మొత్తం వెనక్కు చెల్లించడం ఉండదు.. కానీ ఈ ప్లాన్ కింద పాలసీ కాలంలో బీమా హామీతో పాటు మెచ్యూరిటీ సమయంలో ప్రీమియం సొమ్ము వాపస్ చేస్తుంది. కనీస పాలసీ మెచ్యూరిటీ గడువు 28 ఏండ్లు కాగా, గరిష్ఠంగా 80 ఏండ్లు టెన్యూర్ ఉంటుంది. 10 ఏండ్ల నుంచి 40 ఏండ్ల టర్మ్‌తో ఈ ప్లాన్ లభిస్తుంది. కనీసం రూ.15 లక్షల బీమా హామీతో ఈ పాలసీ కొనవచ్చు. గరిష్ఠంగా ఎంత మొత్తం పాలసీ అయినా తీసుకోవచ్చు. కనీస ప్రీమియం రూ.3000 చెల్లించాల్సి ఉంటుంది. సింగిల్ ప్రీమియం రూ.30 వేలుగా నిర్ణయించింది. ఏడాదికోసారి గానీ, రెండు సార్లు గానీ ప్రీమియం మొత్తం చెల్లించవచ్చు. ఈ ప్లాన్‌లో పాలసీదారుడు జీవించి ఉంటే మెచ్యూరిటీ అనంతరం ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. అధిక ప్రీమియంలు, రైడర్లకు చెల్లించిన మొత్తాలు, పన్నులను ఇందులోంచి మినహాయిస్తారు. మెచ్యూరిటీ తేదీ తర్వాత బీమా కవరేజీ రద్దవుతుంది. ఒకవేళ పాలసీ టర్మ్ ప్రారంభమయ్యాక కవరేజీ సమయంలో పాలసీదారుడు మరణిస్తే.. హామీ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు చెల్లిస్తారు. ఇది ఒకేసారి గానీ, ఐదేండ్ల పాటు లేదా ఆరు నెలలకోసారి, మూడు నెలలకోసారి, నెలకోసారి గానీ విడతల వారీగా గానీ చెల్లిస్తుంది. ఈ విషయమై పాలసీదారు ప్రత్యేకంగా ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. రెగ్యులర్ ప్రీమియంపై ఏడు రెట్ల బెనిఫిట్ లభిస్తుంది. సింగిల్ ప్రీమియంపై 125 శాతం బెనిఫిట్ అందుతుంది. ఆత్మహత్య మినహా ప్రమాదవశాత్తు మరణంతోపాటు అన్ని రకాల మరణాలకూ ఈ ప్లాన్ కవరేజీ లభిస్తుంది. ఈ పాలసీని దగ్గరలోని ఏజెంట్‌ను లేదా ఎల్ఐసి వెబ్‌సైట్‌లోనూ కొనుగోలు చేయడానికి అవకాశం ఉంది.

అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోమారు కీలక వడ్డీ రేట్లను పెంచింది. వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచి గత 22 ఏండ్లలో ఎప్పుడూ లేనంతగా 5.50 శాతానికి చేర్చుతూ.. జులై 26న నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణంపై పోరాటం సాగుతుందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ తెలిపారు. వరుసగా వడ్డీ రేట్ల పెంచుతూ.. రెండు దశాబ్దాల గరిష్టానికి చేర్చడంతో అమెరికాలో ఆర్థిక సంక్షోభం ముదురుతుందనడానికి సంకేతాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మారుతి డ్రైవింగ్ స్కూల్‌లో 20 లక్షల మందికి శిక్షణ

న్యూఢిల్లీ : మారుతి సుజుకి తమ డ్రైవింగ్ స్కూల్స్‌లో ఇప్పటి వరకు 20 లక్షల మందికి డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి.. నూతన మైలురాయిని చేరినట్టు ఆ సంస్థ తెలిపింది. దేశంలోని 230 పైగా నగరాల్లోని 520 పైగా మారుతి సుజుకి డ్రైవింగ్ స్కూళ్లలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తుందని పేర్కొంది. 2005లో తొలిసారి డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించినట్టు పేర్కొంది. తొమ్మిది భాషాల్లోనూ శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించింది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ సేవల విస్తరణ

బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ సర్వీసుల్లో సర్దుబాటు



బెంగళూరు : విమానయాన రంగంలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తమ పలు సేవల్లో సర్దుబాట్లు చేస్తున్నట్టు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) గ్రూప్ వెల్లడించింది. ఎస్ఐఏ, స్కూట్ తమ సామర్థ్యం, నెట్‌వర్క్ మార్పుల్లో భాగంగా బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ సేవలను పునర్నిర్మిస్తున్నట్టు పేర్కొంది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ ఆమోదాలకు లోబడి మార్పులు చేసినట్టు తెలిపింది. 2023 నవంబర్ 5 నుంచి సింగపూర్ - చెన్నయ్ మధ్య రోజువారీ సేవలను స్కూట్ ప్రారంభిస్తున్నట్టు పేర్కొంది. ఫలితంగా సింగపూర్, చెన్నయ్ మధ్య ఎస్ఐఏ గ్రూప్ కార్యకలాపాలు వారానికి 17 సార్ల నుంచి వారానికి 21 సార్ల వరకు పెరుగుతాయని తెలిపింది. 2023 అక్టోబర్ 29 నుంచి సింగపూర్, హైదరాబాద్ మధ్య స్కూట్ రోజువారీ సేవలను అందుబాటులోకి తేనుందని.. రెండు నగరాల మధ్య రాకపోకలను వారానికి ఏడు సార్ల నుండి 12 సార్లకు క్రమంగా పెంచనుందని వెల్లడించింది.

లారస్ ల్యాబ్స్‌కు రూ.28 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో లారస్ ల్యాబ్స్ లాభాలు 88.8 శాతం పతనమై రూ.28.40 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.252.5 కోట్ల లాభాలు నమోదయ్యాయి. ఇదే సమయంలో రూ.1,539 కోట్ల రెవెన్యూ ఆర్జించగా.. గడిచిన క్యూ1లో 23.2 శాతం తగ్గి రూ.1,181.8 కోట్లుగా చోటు చేసుకుంది.

కార్యకలాపాల బలోపేతంపై వోకార్డ్ దృష్టి

హైదరాబాద్ : అంతర్జాతీయ ఔషధ, బయోటెక్నాలజీ కంపెనీ అయిన వోకార్డ్ లిమిటెడ్ తన వ్యాపార కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇందుకోసం కీలక వ్యూహాత్మక చొరవలను తీసుకోనున్నట్లు పేర్కొంది. అమెరికా వ్యాపార పునర్నిర్మాణం, బ్రిటన్‌లో వ్యాక్సిన్ తయారీ కోసం సీరంతో వ్యాక్సిన్ ఒప్పందం, వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నోవెల్ యాంటీబయాటిక్స్ రీసెర్చ్ వంటి అంశాలపై కంపెనీ దృష్టి సారించినట్లు వెల్లడించింది. 2023 నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 7 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు పేర్కొంది. తన అమెరికా కార్యకలాపాల పునర్నిర్మాణంలో, కంపెనీ మోర్టన్ గ్రోవ్‌లోని తన ఉత్పత్తి కేంద్రాన్ని మూసేసి, సైట్‌ను కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు బదిలీ చేయడం ద్వారా ఏడాదికి 12 మిలియన్ డాలర్లు ఆదా చేయాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది.

వికలాంగులపై వివక్ష

వారి జనాభా సమాచారాన్ని 'నిటి ఆయోగ్'లో చేర్చాలి

- వారిలో బహుమితీయ పేదరికం అధికం
- పలు అంశాల్లో వెనకబడి ఉన్న వైనం
- నిపుణులు, విశ్లేషకుల సూచన

న్యూఢిల్లీ : భారత్‌లోని వికలాంగులపై వివక్ష కొనసాగుతున్నదనీ, వారు ఇతర పేదవారి కంటే అధికంగా అనేక రంగాల్లో వెనకబడి ఉన్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. భారతదేశ పేదరికాన్ని 24.9 శాతం నుంచి 15 శాతానికి తగ్గించినట్టు నిటి ఆయోగ్ ఇటీవల తన నివేదికలో పేర్కొన్నది. ఇది ద్రవ్యపరమైన అంశాలకు అతీతంగా పేదరికాన్ని అర్థం చేసుకునేందుకు సానుకూల దశను సూచిస్తుందని నిపుణులు తెలిపారు. అయితే, వికలాంగుల విషయం పైనా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిటి ఆయోగ్ నివేదికలో వికలాంగుల జనాభాకు సంబంధించిన సమాచారాన్ని చేర్చాలను సూచిస్తున్నారు. వైకల్యం లేనివారితో పోలిస్తే వికలాంగ సభ్యులు ఉన్న కుటుంబాలు బహుమితీయ పేదరికాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయని అనేక అధ్యయనాల సమాచారాన్ని, నివేదికలను వారు గుర్తు చేస్తున్నారు. వైకల్యాన్ని నిర్వచించటమంటే పేదరికాన్ని నిర్వచించినంత సవాలుగా ఉంటుందనీ, వికలాంగులు పేదరికానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని విశ్లేషకులు, నిపుణులు నమ్ముతున్నారు. అయితే, పేదరికాన్ని కొలిచే విధానం తరచుగా వారి ప్రత్యేక సవాళ్లు, అవసరాలను విస్మరిస్తుందనీ, పేదరిక సూచీలో వీరి అంశాలు కనబడకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశ జాతీయ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు అనే మూడు సమానమైన పరిమాణాలను కలిగి ఉంటుంది. వీటిని మొత్తం 12 సూచికలు సూచిస్తాయి. భారతదేశంలో పేదరికాన్ని చర్చించడానికి బహుమితీయ సూచికను ఉపయోగించడం ఒక విధానం. అయితే, నివేదిక పరిమిత ఆరోగ్య సూచికలు, పోషకాహారం, పిల్లలు, కౌమార మరణాలు, ప్రసూతి ఆరోగ్యం వంటివి పేదరికంపై వైకల్యం ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోవటం ఆందోళనకరమని నిపుణులు అంటున్నారు.

వికలాంగ వ్యక్తి కుటుంబం వారి జీవితకాలంలో పునరావృతమయ్యే వైద్య వ్యయాన్ని ఎదుర్కొంటుంది. మొత్తం 12 సూచికలను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తుంది. అయినప్పటికీ, వైకల్యం అనే పదం మొత్తం నివేదికలో ప్రసూతి ఆరోగ్యం, పుట్టుకతో వచ్చే వైకల్యాలకు సంబంధించిన నివారణ సందర్భంలో మాత్రమే ఉపయోగించబడింది. వైకల్యం, ఆరోగ్య ఖర్చుల దీర్ఘకాలిక, పునరావృత ప్రభావం, ఇతర అంశాలను విస్మరించటం అనేది ఎంపీఐలోని అన్ని ఇతర సూచికలను ప్రభావితం చేస్తుందని నిపుణులు తెలిపారు.

ఉదాహరణకు, విద్యా కోణంలో చూస్తే.. వైకల్యం ఉన్న వ్యక్తికి అందుబాటులో ఉన్న పాఠశాలలు లేకపోవడంతో పాఠశాల హాజరు తక్కువగా ఉండవచ్చు లేదా పాఠశాల హాజరు ఉండకపోవచ్చు.

ఇది 'పాఠశాల హాజరు' సూచికను ప్రభావితం చేస్తుంది. మరోవైపు, ఆటిజంతో బాధపడుతున్న పిల్లవాడు ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావచ్చు కానీ 'పాఠశాల సంవత్సరాల' సూచికలో 'కోల్పోయిన' అని వర్గీకరించబడదు. కానీ పిల్లవాడు అవసరమైన స్థాయి విద్యను విజయవంతంగా సాధించాడని దీని అర్థం కాదు అని నిపుణులు విశ్లేషకులు తెలిపారు."పేదరికంపై వైకల్యం ప్రభావం అటువంటి సందర్భాలలో కనిపించదు. స్థిరమైన జీవనోపాధి సూచికను చేర్చడం వికలాంగ సంఘం ఎదుర్కొంటున్న సవాళ్లను హైలైట్ చేస్తుంది" అని నిపుణులు చెప్పారు.

మేఘాలయ సీఎం కార్యాలయంపై దాడి కేసులో 20 మంది అరెస్టు

- వీరిలో ఇద్దరు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు

షిల్లాంగ్ : పశ్చిమ గారో హిల్స్ జిల్లాలోని తురా పట్టణంలో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా కార్యాలయంపై సోమవారం రాత్రి జరిగిన దాడిలో ప్రమేయం ఉన్న 20 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు ఉన్నారు. వారిని బెలీనా ఎం మరక్, దిల్చే చ్ మరక్ లుగా గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడి పోలీసు అధికారులు తెలిపారు. తురాలోని మినీ సెక్రెటేరియట్‌పై ఒక గుంపు రాళ్ల రువ్వి, పోలీసు వాహనానికి నిప్పుపెట్టింది. రెండు ఫైర్ టెండర్లను ధ్వంసం చేసింది. ఆ తర్వాత జరిగిన దాడిలో ఐదుగురు పోలీసు అధికారులు గాయపడ్డారు. దాడి జరిగిన సమయంలో తురాను రాష్ట్ర శీతాకాల రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరాహారదీక్ష చేస్తున్న గారో కమ్యూనిటీకి చెందిన పౌర సమాజ సంఘాలతో సంగ్మా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం, రాష్ట్ర రాజధాని షిల్లాంగ్ తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో ఉంది.కాగా, ఆందోళనకారుల దాడిలో కనీసం 21 వాహనాలు ధ్వంసమయ్యాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గుంపును ప్రేరేపించిన ఇద్దరు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతల కోసం కూడా పోలీసులు వెతుకుతున్నారని సదరు అధికారి చెప్పారు. గాయపడిన పోలీసులకు సీఎం రూ.50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

రూ. ఏడు లక్షల కోట్లు అప్పు చేసిన ఎపి ప్రభుత్వం

- కేంద్రానికి పురందేశ్వరి ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి విమర్శించారు. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కేంద్ర మంత్రి మురళీధరన్‌తో కలిసి పురందేశ్వరి భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల మళ్లింపు వంటి రాష్ట్ర ఆర్థిక సమస్యలపై ఫిర్యాదు చేశారు.

అమెరికా నిషేధంతో దినార్ పతనం

ఇరాక్‌లో సెంట్రల్ బ్యాంకుల ఎదుట ప్రజల నిరసన ప్రదర్శనలు



బాగ్దాద్ : స్థానిక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇరాక్‌తో పాటు పలు సెంట్రల్ బ్యాంకుల ఎదుట ప్రజలు బుధవారం భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 2021 నుండి భారీ ఆందోళనలు చేపడుతున్న 'తువార్ తిష్రీన్ (అక్టోబర్ రివల్యూషనరీస్)' నేతృత్వంలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. 14 ఇరాక్ బ్యాంకులను అమెరికా బ్లాక్ లిస్ట్‌లో చేర్చడంతో ఇరాక్‌లో ఒక్కసారిగా దినార్ విలువ పడిపోయింది. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ 14 బ్యాంకులు ఓ ప్రకటన విడుదల చేశాయి.

అమెరికా విధించిన నిషేధం కేవలం డాలర్ ధరపై మాత్రమే ప్రభావం చూపదని, విదేశీ నిధుల ప్రవాహంపై కూడా పరిమితిని విధిస్తుందని బాగ్దాద్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్ యజమాని హైదర్ అల్ శర్మ తెలిపారు. అమెరికా విధించిన నిషేధంతో పలు ప్రతికూల పరిణామాలను ఎదుర్కోవలసి వుంటుందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకుల నష్టాన్ని పూడ్చేందుకు, బ్యాంకులు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు, ఇరాక్‌లోని బ్యాంకింగ్ రంగాన్ని సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఆడిట్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాజకీయ ఉద్రిక్తతలతో బ్యాంకులకు సంబంధం లేదని, బ్యాంకులన్నీ స్వతంత్ర సంస్థలేనని అన్నారు.

ఇరాన్‌కు నిధులను మళ్లించడంతో పాటు మనీలాండరింగ్‌కి పాల్పడ్డాయన్న ఆరోపణలతో ప్రైవేట్ బ్యాంకులను దినార్‌తో డాలర్ల మారకంపై అమెరికా నిషేధం విధించింది. గతంలోని బ్యాంకులతో పాటు తాజాగా ఎనిమిది బ్యాంకులపై అమెరికా ఆంక్షలు విధించింది.

ఇరాక్‌లోని 72 బ్యాంకులలో సుమారు మూడో వంతు బ్లాక్‌లిస్ట్‌లో చేర్చినట్టు ఇద్దరు ఇరాక్ సెంట్రల్ బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో మార్కెట్‌లో మారకపు రేటు అధికమైంది. గడిచిన రెండు రోజుల్లో డాలర్‌కి 1,470గా ఉండే దినార్ మారకం... డాలర్‌కి 1,570 దినార్‌లకు చేరింది. కొందరు వ్యాపారులు సెంట్రల్ బ్యాంక్ వంటి అధికారిక ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించకుండా బ్లాక్ మార్కెట్‌లో కరెన్సీ మారకాన్ని చేపడుతున్నారని సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అలి-అల్-అల్లాక్ పేర్కొన్నారు. డాలర్‌తో దినార్‌ను స్థిరీకరించే చర్యలపై చర్చించేందుకు తాను గత ఆదివారం ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్ - సుదానీతో సమావేశమయ్యానని చెప్పారు.

మొదటి ప్రపంచ శీర్షిక - 2023 హాంకూక్ లండన్ ఇ-ప్రిక్స్ అంచున జేక్ డెన్నిస్



నవతెలంగాణ-హైదరాబాద్ : బ్రిటన్కు చెందిన జేక్ డెన్నిస్ తన మొదటి ప్రపంచ ఛాంపియన్షిప్ టైటిల్ను క్లెయిమ్ చేసే అంచున ఉన్నాడు. ఎందుకంటే హిమపాతం ఆంద్రెట్టి ఫార్ములా ఈ జట్టు డ్రైవర్ ఫార్ములా ఈ సీజన్లోని చివరి రెండు రేసుల్లో స్వదేశీ అభిమానుల ముందు అతను శనివారం నాటి 2023 హాంకూక్ లండన్ ఇ-ప్రిక్స్ డబుల్-హెడర్ ప్రారంభ రేసులో డెన్నిసు మొదటి ప్రపంచ ఛాంపియన్షిప్ టైటిల్ను సాధించడానికి రోమ్ వీధుల్లో అతని అత్యున్నత విజయాన్ని పునరావృతం చేయడం సరిపోతుంది. కానీ ఈ సీజన్ పదే పదే నిరూపించబడినట్లుగా, ఫార్ములా ఈ లో ఏదైనా జరగవచ్చు. ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా ఈ వరల్డ్ ఛాంపియన్షిప్ సీజన్ 9లో 15, 16 రేసులు ఫార్ములా ఈ చరిత్రలో అత్యంత పోటీతత్వం, వినోదాత్మకంగా ఉన్నవాటిని స్థిరపరుస్తాయి. బెర్లిన్, మెక్సికో సిటీ, దిరియా, జకార్తా, మొనాకో, రోమ్లలో స్థాపించబడిన సర్క్యూట్లలో ఛాంపియన్షిప్ తిరిగి వచ్చినంత కాలం వారి విప్లవాత్మక ఈవీ సాంకేతికతతో త్వరగా పట్టు సాధించి, అన్ని సీజన్లలో ఆధిపత్యం కోసం పోరాడిన నలుగురు డ్రైవర్లలో డెన్నిస్ ఒకరు. నాలుగు నగరాల కంటే - హైదరాబాద్, కేప్ టౌన్, సావో పాలో, పోర్ట్ లాండ్. ఎన్విజన్ రేసింగ్ నిక్ కాసిడీ, బెర్లిన్, మొనాకోలలో బ్యాక్-టు-బ్యాక్ విజయాలతో సహారౌండ్లు 4 నుండి 9 వరకు ఆరు రేసుల్లో ఐదు పోడియమ్లను క్లెయిమ్ చేస్తూ మిడ్-సీజన్లో నియంత్రణ సాధించి బలమైన ఛాంపియన్ షిప్ పోటీదారుగా ఎదిగాడు.

బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ సేవలను పునఃనిర్మించనున్న ఎస్ఐఏ గ్రూప్

నవతెలంగాణ-హైదరాబాద్ : : వృద్ధి చెందుతున్న డిమాండ్ విధానాలకు స్పందనగా ఎస్ఐ, స్కూట్ తమ సామర్థం, నెట్వర్క్ ను సర్దుబాటు చేస్తున్న నేపథ్యంలో తన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ సేవలను పునర్నిర్మిస్తున్నట్లు సింగపూర్ ఎయిర్లైన్స్ (ఎస్ఐఏ) గ్రూప్ ఆఫ్ ఎయిర్లైన్స్ ప్రకటించింది. ఎస్ఐఏ 2023 అక్టోబర్ 29 నుండి సింగపూర్, హైదరాబాద్ మధ్య స్కూట్ రోజువారీ సేవలను స్వాధీనం చేసుకుంటుంది. ఈసందర్భంగా సింగపూర్ ఎయిర్ లైన్స్ ఇండియా జనరల్ మేనేజర్ సై యెన్ చెన్ మాట్లాడుతూ... ఎస్ఐఏ గ్రూప్ భారతదేశానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కీలక మార్కెట్లోని మరిన్ని నగరాలకు తమ పరిశ్రమ-ప్రముఖ ఉత్పత్తులు, సేవలను కస్టమర్లకు అందించగలుగు తోందన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లకు తమ సేవల పునర్నిర్మాణం ఎస్ఐఏ గ్రూప్ ఎయిర్లైన్స్ పోర్ట్ ఫోలియో బలాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. స్కూట్ ఇండియా జనరల్ మేనేజర్ బ్రియాన్ టోరే మాట్లాడుతూ... చెన్నైలో స్కూట్ కార్యకలాపాలను పునఃప్రారంభించడం వనరులను ఆప్టిమైజ్ చేయడానికి, డిమాండ్తో సామర్థ్యాన్ని మెరుగ్గా సరిపోల్చడానికి తమ గ్రూప్ నెట్వర్క్ వ్యూహానికి అనుగుణంగా ఉంటుందన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ తమకు ముఖ్యమైన మార్కెట్ అన్నారు. తమ రూట్ నెట్వర్క్ లో చెన్నైని చేర్చడం ద్వారా తాము ఇప్పుడు భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడు రాజధాని నగరానికి వ్యక్తులు, కుటుంబాలను అనుసంధానం చేయవచ్చు, సేవలు అందించవచ్చన్నారు. తమ చెన్నై విమానాలను తిరిగి ప్రారంభించడం మేమెంతో సంతోషిస్తున్నామన్నారు. సమీప భవిష్యత్ లో విస్తరించనున్న తమ నెట్ వర్క్ తమతో కలసి ప్రయాణించే విలువైన కస్టమర్లకు స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్నామన్నారు.

గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటేయాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ

అమరావతి : విశాఖ స్టీలు ప్లాంటును కేంద్రం ఇప్పటి వరకూ ప్రైవేటీకరించలేకపోయిందని ఇప్పుడు అదానీని, గంగవరం పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు రాకుండా అడ్డుకుంటూ నష్టాలబాట పట్టిస్తోందని సీఐటీయూ ఏపీ రాష్ట్ర కమిటీ పేర్కొంది. గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటేయాలని కోరింది. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. మూడు రోజుల నుంచి వెయ్యి కోట్ల విలువగల కోకింగ్ కోల్‌ను గంగవరం పోర్టులోకి రాకుండా అదానీ కంపెనీ ఆపేసిందని, రూ.71 లక్షలు విశాఖ ప్లాంటు డేమరేజ్ కట్టిందని తెలిపారు. పోర్టులో ఉన్న కోల్‌ను కూడా కన్వేయర్ బెల్టు రిపేరు పేరుతో సరఫరా నిలిపేసిందని, పోర్టును అదానీ స్వాధీనం చేసుకున్న తరువాత రవాణా ఛార్జీలు విపరీతంగా పెంచిందని వివరించారు. రూ.51 కోట్ల బకాయి ఉన్నారనే నెపంతో ప్లాంటు ఉత్పత్తిని దెబ్బతీయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం, అదానీ కలిసి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. స్టీలు ప్లాంటు భూములు 1,100 ఎకరాలు అదానీ పోర్టుకు ప్రభుత్వం అప్పగించిందని, విశాఖకు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటపాడు మండలంలో పనికిరాని ప్రభుత్వ భూములు స్టీలుప్లాంటుకు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి గంగవరం పోర్టులో ఉన్న 10.54 శాతం వాటాను మోడీ ఒత్తిడితో కారుచౌకగా పోర్టు యాజమాన్యానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బదిలీ చేశారని అన్నారు. ఇప్పటికీ పోర్టుకు స్టీలు ప్లాంటే నీటిని సరఫరా చేస్తోందని, అయినా ప్లాంటును దెబ్బతీసే విధంగా అదానీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉత్పత్తిని దెబ్బతీసి కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని, రెండున్నరేళ్ల నుంచి ఉత్పత్తిని 40 శాతం తగ్గించారని, ఫలితంగా ఏడాదికి రూ.3,900 కోట్లు ప్లాంటుకు నష్టాలు వచ్చాయని అన్నారు. ఇప్పుడు పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు రాకుండా అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004లో సుదీర్ఘ పోరాటం తరువాత 590 మంది గంగవరం, దిమ్మపాళెం గ్రామాల నుండి నిర్వాసితులను యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులుగా తీసుకుందని, వారికి ఇప్పటికీ రూ.14 వేల జీతం ఇస్తున్నారని తెలిపారు. పర్మినెంటు చేయాలని 22 రోజుల నుండి పోరాడుతున్నా పోర్టు యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని అన్నారు. గత వారం నుండి స్టీలు ప్లాంటులో తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయని, రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ దెబ్బతింటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నట్లు నటిస్తోందని విమర్శించారు.

అదానీ కంపెనీతో మాట్లాడే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో గంగవరం పోర్టును ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

మణిపాల్ హాస్పిటల్ రోబోటిక్ సెంటర్ ఆఫ్ ఎకులెన్సు ప్రారంభించిన గవర్నర్

నవతెలంగాణ : ఆంధ్రప్రదేశ్ వైద్య రంగానికి విశిష్ట సేవలందించిన మణిపాల్ హాస్పిటల్ విజయవాడ మరో సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. 4వ తరానికి చెందిన డా. విన్సీ - రోబోను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఈ రోబో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్ర మంలో మణిపాల్ ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ డా. సుదర్శన్ బల్లాల్, మణిపాల్ హాస్పిటల్ విజయవాడ డైరెక్టర్ సుధాకర్ కంటిపూడి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... వైద్య రంగంలో మరోకొత్త చరిత్రకు మణపాల్ హాస్పిటల్ తెరతీసిందని చెప్పారు. రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీతో ఆంధ్రప్రదేశ్ వైద్యరంగం మరో కీలక మైలురాయిని అందుకుందన్నారు. ఈ కార్య క్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. మణిపాల్ హాస్పిట ల్స్ వారు ప్రవేశపెట్టిన ఈ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ అడ్వాన్స్ మెంట్ అనేది ఏపీ ఆరోగ్య సంర క్షణ సాంకేతికతలో ఒక గొప్ప ముందడుగు అని స్పష్టం చేశారు. రోబోటిక్ సర్జరీతో రోగులకు కచితత్వం ఉంటుందన్నారు. దీంతో రోగులు త్వరగా కోలుకోవడం జరు గుతోందని పేర్కొన్నారు.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

- కాలువల నిర్వహణ కూడా చేయలేని ప్రభుత్వం :టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి : సాగునీటి రంగానికి సిఎం జగన్ తీరని ద్రోహం చేశారని, రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అటకెక్కించారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. సాగునీటి రంగం, ప్రాజెక్టుల నిర్మాణంపై సమాధానం చెప్పాలని, లేదంటే అధికారంలో కొనసాగే అర్హత లేదని అన్నారు. కోస్తాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుల వారీ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు చేసిన ఖర్చులు, వాటి స్థితిగతుల గురించి వివరించారు. కోస్తాంధ్ర ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వం రూ.21,442 కోట్లు ఖర్చు చేసిందని, వైసిపి నాలుగేళ్లలో కేవలం రూ.4,375 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. తాము 23 ప్రాజెక్టులు పూర్తిచేసి 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామన్నారు. వైసిపి నాలుగేళ్లలో ఒక్క ప్రాజెక్టూ పూర్తిచేయలేదని విమర్శించారు. వంశధార ఫేజ్-2 నిర్మాణంపై గడువు పెంచడం, తేదీలు మార్చి ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిపాటి మిగిలిన తోటపల్లి బ్యారేజీ నిర్మాణ పనులను ప్రభుత్వం పూర్తిచేయలేపోయిందని, రూ.56 కోట్ల ప్రజల సొమ్మును నీళ్లపాలు చేసిందని విమర్శించారు. బిల్లులు నిలిపేయడంతో మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కాంట్రాక్టరు పనులు ఆపేసి వెళ్లిపోయారని తెలిపారు. తారకరామ తీర్థ సాగర్ రిజర్వాయరులో పెరిగిన పిచ్చిచెట్లను తొలగించలేకపోయారని, హిరమండల పనులను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పలేని దుస్థితి నెలకొందని అన్నారు. పురుషోత్తమ పట్నం ప్రాజెక్టులో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ట్రిబ్యునళ్ల ముందు నిలిపి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. తాటిపూడి ఆయకట్టు పనులను నిలిపేసి తూర్పుగోదావరి జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర లిఫ్ట్ బిల్లులు ఇవ్వకుండా పనులు ఆపారని, చింతలపూడి లిఫ్ట్‌కు నిధులు లేవని భూసేకరణ నిలిపేశారని వివరించారు. పులిచింతల ప్రాజెక్టు గేట్లకు గ్రీజు కూడా రాయలేక గేట్లు కొట్టుకుపోయేలా ప్రభుత్వం చేసిందన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో ఒక టన్నెల్ తాము పూర్తిచేశామని, నీళ్లిచ్చే సమయానికి ఈ ప్రభుత్వం పనులన్నీ ఆపేసిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో తవ్విన మట్టిని శ్రీశైలం కొండల్లో పోస్తున్నారని, దీనివల్ల ప్రాజెక్టులో సిల్ట్ పెరిగి నష్టం ఎక్కువ జరుగుతుందని వివరించారు. గుండ్లకమ్మ రిజర్వాయరు నిర్వహణను పట్టించుకోకపోవడంతో గేట్లు కొట్టుకుపోయాయని, అడ్డగోలుగా ఇసుక తవ్వేయడంతో మొత్తం ప్రాజెక్టు ప్రమాదంలో పడే పరిస్థితి ఉందన్నారు. కృష్ణా డెల్టా ఆధునీకరణ ఆపేయడంతో ఇప్పటికీ లక్షల ఎకరాల్లో నీటి ఎద్దడి ఉందని, ప్రాజెక్టుల్లో గుర్రపుడెక్క తీయడం లేదని విమర్శించారు. ఇరిగేషన్ మంత్రి సొంత నియోజకవర్గం సత్తెనపల్లిలో రైతులే చందాలు వేసుకుని కాలువలు బాగుచేసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. గోదావరి డెల్టాలో గేట్లు సరిగ్గా లేవని, అన్నీ లీకవుతున్నాయని, కొన్ని గేట్లు తుప్పుపట్టాయని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా ఫ్లడ్ నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో పంటపొలాలు నీళ్లపాలవుతున్నాయని అన్నారు. రాయలసీమకు 300 టిఎంసిలు తరలించే గొప్ప ప్రాజెక్టు గోదావరి-పెన్నా నదుల అనుసంధానాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పినట్లు ఐదు నెలల్లో ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలో కట్టుకథలు చెప్పారని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా నాలుగేళ్లలో రూ.40 వేలకోట్లు దోచుకున్నారని, వీటితో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తిచేసి మొత్తం భూములకు నీళ్లు ఇవ్వొచ్చని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాజెక్టులకు నిర్దిష్ట గడువు విధించి పూర్తిచేస్తామని చెప్పారు.

సీనియర్ ఐపీఎస్‌ల నేతృత్వంలో

ఫ్లడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు

- 2900 మందిని వరదల నుంచి కాపాడిన పోలీసులు
- 24 గంటల పాటు వరదలను సమీక్షిస్తున్నాం : డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏర్పడ్డ భారీ వరదలను సమీక్షించి ప్రజలను రక్షించడానికి గానూ రాష్ట్ర స్థాయిలో ఫ్లడ్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ అంజనీ కుమార్ గురువారం తెలిపారు. ఈ మానిటరింగ్‌సెల్‌ను అదనపు డీజీలు శివధర్ రెడ్డి, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్‌లు స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత 24 గంటల్లో ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు వరద ముంపు ప్రాంతాల నుంచి 2900 మందిని నీట మునగకుండా రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ఆయన చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొరాంచ గ్రామం పూర్తిగా వరద నీటితో మునిగిపోవటంతో అక్కడి గ్రామస్తులను పూర్తిగా ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా సహాయ శిబిరాలకు చేర్చామనీ, ఇందుకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లను కూడా ఉపయోగించామని అంజనీ కుమార్ వివరించారు. కాగా, రాగల 24 గంటల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం తాజాగా హెచ్చరించిన నేపథ్యంలో అన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లు మరింత జాగరూకతతో మెలగాలని ఆయన ఆదేశించారు. భద్రాచలం, ములుగు, అదిలాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రదేశాలు, గ్రామాల గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని రెండు రీజియన్ల ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, షానావాజ్ ఖాసీం లు సేకరిస్తూ వరద బాధితులను ఆదుకోవటానికి తగిన చర్యలను చేపడుతున్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని మూసి పరివాహక ప్రాంతంలో సైతం పర్యవేక్షణాధికారుల సంఖ్యను పెంచి ముంపునకు గురయ్యే ప్రాంతం నుంచి ప్రజలను తరలిస్తున్నట్టు ఆయన వివరించారు. వరద ప్రాంతాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారీ కార్యాలయం నుంచి అందుతున్న ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేస్తున్నామని డీజీపీ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో భద్రాచలంలో పెరుగుతున్న గోదావరి నీటి మట్టాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని ముంపునకు గురయ్యే ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను చేపట్టినట్టు చెప్పారు. కాగా, భారీ వర్షాల కారణంగా ప్రజలెవరు కూడా విద్యుత్ స్తంభాలను తాకటం కానీ, రోడ్లపై పడి ఉన్న వైర్లను కానీ తాకటం వంటివి చేయొద్దని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ఉత్తర తెలంగాణలో విద్యుత్ స్తంభాలను తాకిన కారణంగా ఇద్దరు వ్యక్తులు ప్రాణాలను కోల్పోయారని ఆయన చెప్పారు.

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన సహాయక చర్యల్లో 18 బోట్లు : డీజీ వై. నాగిరెడ్డి

భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలను రక్షించటానికి గానూ ఉత్తర, దక్షిణ తెలంగాణా జిల్లాల్లో మొత్తం 18 పడవలు సహాయక చర్యలకు రంగంలోకి దిగి పని చేస్తున్నాయని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) వై. నాగిరెడ్డి తెలిపారు. సుశిక్షితులైన క్రూ సిబ్బంది కూడా ముగ్గురు నుంచి నలుగురి వరకు ఈ పడవలలో పని చేస్తున్నారని చెప్పారు. అలాగే, వరదల్లో చిక్కుకొని కొట్టుకుపోయే బాధితులను కాపాడటానికి 148కి పైగా గత ఈతగాళ్ల కూడా ప్రమాద ప్రాంతాల్లో పని చేస్తున్నారని ఆయన తెలిపారు.